

ANGRAU
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

# వ్యవసాయం

వ్యవసాయ సచిత్ర మాస పత్రిక

సంపుటి - 14 | సంచిక - 08 | ఆగస్టు 2022 | పేజీలు - 44 | వెల రూ. 20/-



ప్రత్తిలో గులాబిరంగు పురుగు యాజమాన్యం



పొట్టేళ్ళ పెంపకం - యువకుడి విజయగాథ



చేపల పెంపకానికి అనువైన రకాలు



వర్షాకాలంలో పశువులలో వచ్చే వ్యాధులు



మిరప నారుమళ్ళ యాజమాన్యం

# ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయములో జరిగిన

# వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక




అగ్రి పాలిసెట్-2022 ఫలితాల విడుదల @ ఆర్.ఎ.ఆర్.ఎస్., లాం.



వన మహోత్సవం @ ఆర్.ఎ.ఆర్.ఎస్., లాం.




నూతన తరగతి భవనాలు, విత్తన గిడ్డంగులు, రైతు వసతి గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమం @ పరిపాలనా భవనం, లాం.



శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి @ పరిపాలనా భవనం, లాం.

ANGRAU

# వ్యవసాయం

శ్రీ శుభకృత్ నామ సం॥
శ్రావణ మాస శు.చవితి మొ॥
భాద్రపద మాస చవితి వరకు

## సంపాదక వర్గం

ప్రధాన సంపాదకులు
**డా॥ ఎ. లలిత**
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి (ఎఫ్.ఎ.సి.)

సంపాదకులు
**డా॥ యం. వెంకటరాములు**
సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ)

వ్యవసాయం మాస పత్రిక
సంవత్సర చందా రూ. 200/- లేదా
జీవితకాల (10 సంవత్సరములు) చందా
రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి.
రూపంలో చెల్లించవచ్చు.
మని ఆర్డర్ లేదా డి.డి అయితే PRINCIPAL AGRICULTURAL INFORMATION OFFICER, GUNTUR, ANDHRA PRADESH పేరిట తీసి గుంటూరులో చెల్లేవిధంగా పంపించాలి.

*చిరునామా :*
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము
అడ్వాన్స్‌డ్ పోస్టు గ్రాడ్యుయేషన్ సెంటర్ ఆవరణ,
లాం, గుంటూరు - 522 034, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 91005 00223
ఈ-మెయిల్ : paio@angrau.ac.in

## విషయ సూచిక

1. ఉపకులపతి సందేశం ................................ 5
2. విస్తరణ సంచాలకుల సందేశం ......................... 6
3. వివిధ పంటలలో ఈ మాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు ................................ 7
4. సాంకేతిక వ్యాసాలు
▶ వరి నారుమడిలో ఆశించు పురుగులు మరియు వాటి యాజమాన్యము ................................ 17
▶ ఎడగారు వరిలో నల్లి యాజమాన్యం ................ 19
▶ ప్రత్తిలో సమగ్ర కలుపు యాజమాన్యం .............. 21
▶ ప్రత్తిలో గులాబిరంగు పురుగు నివారణకు చేపట్టవలసిన ముందు జాగ్రత్త చర్యలు.............. 24
▶ మిరప నారుమళ్ళ యాజమాన్యంలో పాటించవలసిన మెళకువలు ........................................ 26
▶ చెఱకు తోటలను నిలగట్టుట - జడచుట్లు ........... 27
▶ వర్షాకాలంలో పశువులలో వచ్చే వ్యాధులు మరియు వాటి నివారణ చర్యలు................................ 29
▶ చేపల పెంపకానికి అనువైన రకాల ఎంపికలో పాటించాల్సిన మెళకువలు ............................ 32
▶ పంటల భీమా పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ ముందంజ ........................................ 34
5. విశ్వవిద్యాలయ వార్తలు.............................. 38
6. రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు........... 39
7. కర్షక విజయాలు
▶ వాణిజ్య సరళిలో పొట్టేళ్ళ పెంపకంతో అధిక లాభాలు గడిస్తున్న యువకుడు ...................... 40

పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను
తమ అమూల్యమైన సలహాలను, సూచనలను అందచేయవలసిందిగా కోరుచున్నాము.

# ఆగస్టు మాసం క్యాలెండర్ - 2022

| SUN<br>ఆది | MON<br>సోమ | TUE<br>మంగళ | WED<br>బుధ | THU<br>గురు | FRI<br>శుక్ర | SAT<br>శని |
|---|---|---|---|---|---|---|
| | **1**<br>శు.చవితి రా. 2-32<br>పుబ్బ ప. 2-55<br>రా.వ. 10-22 ల 12-01 | **2**<br>పంచమి రా. 2-27<br>ఉత్తర ప. 3-46<br>రా.వ. 12-17 ల 1-55 | **3**<br>షష్ఠి రా. 1-51<br>హస్త సా. 4-07<br>రా.వ. 12-06 ల 1-41 | **4**<br>సప్తమి రా. 12-50<br>చిత్ర సా. 4-01<br>రా.వ. 9-30 ల 11-04 | **5**<br>అష్టమి రా. 11-25<br>స్వాతి ప. 3-29<br>రా.వ. 8-51 ల 10-24 | **6**<br>నవమి రా. 9-37<br>విశాఖ ప. 2-35<br>సా.వ. 6-22 ల 7-54 |
| **7**<br>దశమి రా. 7-35<br>అనూరాధ ప. 1-23<br>సా.వ. 6-40 ల 8-10 | **8**<br>ఏకాదశి సా. 5-19<br>జ్యేష్ఠ ఉ. 11-58<br>రా.వ. 7-25 ల 8-54 | **9**<br>ద్వాదశి ప. 2-54<br>మూల ఉ. 10-22<br>ఉ.వ. 8-52 ల 10-22,<br>రా.వ. 7-14 ల 8-43 | **10**<br>త్రయోదశి ప. 12-18<br>పూర్వాషాఢ ఉ. 8-33<br>సా.వ. 4-02 ల 5-31 | **11**<br>చతుర్దశి ఉ. 9-59<br>ఉత్తరాషాఢ ఉ. 7-01,<br>శ్రవణం తె. 5-30<br>ఉ.వ. 10-45 ల 12-15 | **○12**<br>పూర్ణిమ ఉ. 7-37,<br>బ.పాడ్యమి తె. 5-33<br>ధనిష్ఠ తె. 4-08<br>ఉ.వ. 9-16 ల 10-48 | **13**<br>విదియ తె. 3-29<br>శతభిషం తె. 3-00<br>ఉ.వ. 10-59 ల 12-31 |
| **14**<br>తదియ రా. 2-08<br>పూర్వాభాద్ర రా. 2-14<br>ఉ.వ. 9-12 ల 10-45 | **15**<br>చవితి రా. 12-58<br>ఉత్తరాభాద్ర రా. 1-49<br>ఉ.వ. 11-39 ల 1-14 | **16**<br>పంచమి రా. 12-16<br>రేవతి రా. 1-52<br>ప.వ. 1-51 ల 3-27 | **17**<br>షష్ఠి రా. 12-01<br>అశ్విని రా. 2-22<br>రా.వ. 10-17 ల 11-55 | **18**<br>సప్తమి రా. 12-18<br>భరణి తె. 3-23<br>ప.వ. 12-22 ల 2-02 | **19**<br>అష్టమి రా. 1-06<br>కృత్తిక తె. 4-53<br>సా.వ. 4-08 ల 5-50 | **20**<br>నవమి రా. 2-20<br>రోహిణి పూర్తి<br>రా.వ. 10-07 ల 11-51 |
| **21**<br>దశమి తె. 3-58<br>రోహిణి ఉ. 6-45<br>ప.వ. 12-53 ల 2-39 | **22**<br>ఏకాదశి తె. 5-53<br>మృగశిర ఉ. 9-06<br>సా.వ. 6-23 ల 8-09 | **23**<br>ద్వాదశి పూర్తి<br>ఆర్ద్ర ఉ. 11-38<br>రా.వ. 12-56 ల 2-42 | **24**<br>ద్వాదశి ఉ. 7-54<br>పునర్వసు ప. 2-15<br>రా.వ. 11-04 ల 12-50 | **25**<br>త్రయోదశి ఉ. 9-54<br>పుష్యమి సా. 4-46<br>వర్జ్యము లేదు | **26**<br>చతుర్దశి ఉ. 11-39<br>ఆశ్రేష రా. 7-01<br>ఉ.వ. 6-46 ల 8-31 | **•27**<br>అమావాస్య ప. 1-04<br>మఘ రా. 8-55<br>ఉ.వ. 7-58 ల 9-42,<br>తె.వ. 5-24 ల |
| **28**<br>శు.పాడ్యమి ప. 2-02<br>పుబ్బ రా. 10-23, ఉ.శే.వ.<br>7-06 వ తె.వ. 5-51 | **29**<br>విదియ ప. 2-30<br>ఉత్తర రా. 11-20<br>ఉ.శే.వ. 7-31 వ | **30**<br>తదియ ప. 2-28<br>హస్త రా. 11-48<br>ఉ.వ. 7-54 ల 9-31 | **31**<br>చవితి ప. 1-57<br>చిత్ర రా. 11-48<br>ఉ.వ. 7-48 ల 9-24,<br>తె.వ. 5-17 ల | | | |

## ఆశ్లేష కార్తె (03.08.2022 నుండి 16.08.2022)

| | | |
|---|---|---|
| వరి | : | అంతర కృషి, సస్యరక్షణ |
| జొన్న | : | అంతర కృషి, రెండవ దఫా ఎరువులు వేయుట, సస్యరక్షణ |
| సజ్జ | : | అంతరకృషి, సస్యరక్షణ |
| వేరుశనగ | : | సస్యరక్షణ |
| ఆముదం | : | రసాయనిక ఎరువులు వేయుట, అంతరకృషి, సస్యరక్షణ |
| పొగాకు | : | నారుపోయుట, తర్వాత సస్యరక్షణ |
| మొక్కజొన్న | : | రసాయనిక ఎరువులు వేయుట |
| కొర్ర | : | ఆలస్యంగా వర్షాలు పడినచో వెంటనే విత్తనం వేయుట |
| రాగి | : | మే నెలలో విత్తిన రాగి కోతలు |
| కాయధాన్యాలు | : | తక్కువ పంట కాలపు పెసర, మినుము కోతలు, కంది పంటకు కలుపు తీయుట |
| ప్రత్తి | : | అంతర కృషి, రసాయన ఎరువులు వేయుట |
| చెఱకు | : | జడచుట్లు వేయుట |

## మఖ కార్తె (17.08.2022 నుండి 30.08.2022)

| | | |
|---|---|---|
| జొన్న | : | మాఘీ జొన్నకు నేల తయారి |
| సజ్జ | : | సస్యరక్షణ, కోతలు |
| మొక్కజొన్న | : | సస్యరక్షణ |
| కొర్ర | : | రసాయనిక ఎరువులు వేసి అంతరకృషి చేయుట |
| ఆముదం | : | అంతర కృషి, సస్యరక్షణ, దాసరి పురుగు నివారణ |
| పొగాకు | : | నారుమళ్ళలో సస్యరక్షణ |
| వరి | : | సస్యరక్షణ, కలుపు తీయుట, రెండవ దఫా ఎరువులు వేయుట |
| కాయధాన్యాలు | : | తక్కువ పంట కాలపు మినుము కోతకు వస్తుంది. |
| వేరుశనగ | : | సస్యరక్షణ |
| ప్రత్తి | : | సస్యరక్షణ |
| చెఱకు | : | జడచుట్లు వేయుట |
| రాగి | : | సస్యరక్షణ |

# ప్రత్తిలో గులాబిరంగు పురుగును గమనిస్తూ యాజమాన్యం చేపట్టాలి



**డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి**
ఉపకులపతి
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్తి 2020-21 వ సంవత్సరములో 6.06 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. బి.టి. ప్రత్తి రావటంతో ప్రధాన సమస్య అయిన కాయ తొలుచు పురుగులను అధిగమించడంతో పాటుగా, సాగులో ఇబ్బందులు కొంత తగ్గడం, లాభదాయకంగా ఉండటంతో ప్రత్తిని అన్ని రకాల నేలల్లోను సాగు చేయడం జరుగుతున్నది. బి.టి. ప్రత్తి సాగులోకి రాకముందు నాన్ బి.టి. సంకర రకాలను సాగు చేసినప్పుడు ప్రత్తిలో గులాబిరంగు పురుగు వలన 20-50 శాతం నష్టం వాటిల్లుతూ ఉండేది. 2002 వ సంవత్సరములో బి.టి. ప్రత్తి సాగులోకి వచ్చిన తరువాత గులాబిరంగు పురుగు కనుమరుగైనది. కాని 2010 వ సంవత్సరంలో గుజరాత్ లో బి.జి.1 ప్రత్తిలో మరియు 2014 వ సంవత్సరములో గుజరాత్ లోనే బి.జి.2 ప్రత్తిలో కూడా ఈ గులాబిరంగు పురుగు ఉనికిని గుర్తించడం జరిగింది. ఈ పురుగు 2015-16 సంవత్సరములో మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణా మరియు ఆంధ్రప్రదేశ్‌లలో బి.జి.2 ప్రత్తిలో ఆశించడం జరిగింది. గత రెండు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో ఈ పురుగు ఉధృతి గణనీయంగా పెరగడమే కాకుండా 2021-22 పంట కాలంలో పంట విత్తిన 75-80 రోజులకే ఆశించి, క్రమేణా ఉధృతి పెరుగుతూ కొంతమేర నష్టాన్ని కలిగించింది.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో బి.టి. ప్రత్తి సాగులో సమస్యగా మారిన గులాబిరంగు పురుగు యాజమాన్యంపై సరైన అవగాహన లేకపోవడం, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టకపోవడం వలన రైతాంగం కొంత వరకు నష్టాన్ని చవిచూస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని, మన రాష్ట్ర రైతాంగం ఈ పురుగు ఆశించే సమయం, ఉధృతి, దాని జీవిత చక్రం మరియు నివారణ పద్ధతులపై సరైన అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం. గత 3-4 సంవత్సరాలుగా గులాబిరంగు పురుగు సాగులో ఉన్న బి.టి. 2 రకాలకు నిరోధక శక్తిని పెంచుకోవడం, శరణార్థక పంటగా సాధారణ ప్రత్తి రకాలను వేసుకోకపోవడం, పంట పూర్తి అయిన తరువాత కూడ ప్రత్తి మోళ్ళను పొలాలలోనే ఉంచడంతో పాటు, జిన్నింగ్ మిల్లుల్లో జిన్నింగ్ పూర్తి అయిన తరువాత వచ్చిన గుడ్డి ప్రత్తి మరియు పురుగు ఆశించిన దూది విత్తనాలను సమూలంగా నిర్మూలించకపోవడం వలన గులాబి రంగు పురుగు సంతతి బాగా వృద్ధి చెందుతున్నది.

రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులను అనుసరించి గులాబిరంగు పురుగును సమర్ధవంతంగా నివారించుకోవచ్చును. ప్రధానంగా పంట లేని సమయాన, విత్తడానికి ముందు, పంట కాలంలో మరియు పంట తీసిన తరువాత వివిధ యాజమాన్య చర్యలను చేపట్టాలి. వేసవి ప్రత్తి సాగును పూర్తిగా నివారించాలి. రెప్యూజి ప్రత్తి సాగును రైతులు వేసే విధంగా ప్రోత్సహించాలి. ప్రత్తి రైతులు గులాబిరంగు కాయ తొలుచు పురుగు ఉనికిని, ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సలహాలకనుగుణంగా సమగ్ర సస్యరక్షణ చర్యలను సామూహికంగా చేపట్టడం ద్వారా ప్రత్తిలో అధిక దిగుబడులను సాధిస్తారని ఆశిస్తున్నాను.

(ఏ. విష్ణువర్ధన రెడ్డి)

# సమగ్ర పంటల యాజమాన్యంతో సాగు ఖర్చు తగ్గించుకోవాలి



**డా॥ పి. రాంబాబు**
విస్తరణ సంచాలకులు
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలను తీర్చేలా ఆహార ఉత్పత్తిని సాధించడానికి మన రైతాంగం అవసరానికి మించి ఎక్కువ సాగు నీటిని వినియోగించడం, నిర్దిష్ట పరిమాణాన్ని మించిన రసాయన ఎరువుల వాడకం, విచక్షణా రహితంగా పురుగు మందుల వాడకం వంటి అనేక అంశాలు ఎంతో ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ విధమైన చర్యల ఫలితంగా, భూగర్భ జలాలు క్షీణించి పోవడం, భూమి నిస్సారమవ్వడం, పురుగులు రోగనిరోధక శక్తిని అభివృద్ధి చేసుకోవడం వల్ల గతంలో ప్రాధాన్యత లేని పురుగులు మరియు తెగుళ్ళ ఉధృతి పెరగడం, పురుగు మందుల అవశేషాలు ఉత్పత్తులలో ఉండి పోయి, నాణ్యతా పరమైన సమస్యలు తలెత్తడంతో పాటు, సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. వీటన్నింటినీ అధిగమించడానికి రైతులు సమగ్ర పంటల యాజమాన్యంను పాటించాలి.

సమగ్ర పంటల యాజమాన్యంలో భాగంగా, సాగు నీటి వనరుల సద్వినియోగం, ఎరువులు మరియు పురుగు మందుల మితిమీరి వాడకం తగ్గించుట వంటి చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా మన రాష్ట్రంలో ఎక్కువ శాతం సాగు విస్తీర్ణం వర్షాధారం క్రింద ఉంది మరియు వర్షాధారంగా సాగయ్యే విస్తీర్ణంలో అధిక శాతం నేలలు తేమను ఎక్కువ కాలం నిలుపుకోలేని తేలికపాటి చల్కా నేలలే. ఈ నేలల్లో సాగు చేసే పంటలలో తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తిని సాధించడానికి ఈ నేలలకు తేమను నిలుపుకునే గుణాన్ని పెంపొందించుకునే సాగు పద్ధతులను పాటించాలి. ముఖ్యంగా పడిన వర్షం అంతా సత్వర వినియోగం జరగదు. అందువలన పడిన అధిక వర్షాన్ని పంట పొలంలో పల్లపు ప్రాంతాలలో సేకరించి, నిల్వ చేయుటకు వీలుగా, పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలి. వీటి ద్వారా నిల్వ చేయబడిన నీటిని పంట సున్నిత దశలలో వినియోగించి ఉత్పాదకతలో గణనీయమైన వృద్ధి సాధించవచ్చును.

సమగ్ర పంటల యాజమాన్యంలో సమగ్ర సస్యరక్షణ ముఖ్యమైనది. సమగ్ర సస్యరక్షణ అనగా ఆచరణ యోగ్యమైన భౌతిక, సేద్య, జీవ, యాంత్రిక, రసాయన పద్ధతులను మేళవించి చీడపీడలను అదుపులో ఉంచి, పంటకు ఆర్థిక నష్టాన్ని కలిగించే స్థాయికి చేరకుండా నియంత్రించటం. తప్పనిసరి పరిస్థితులలో మాత్రమే శాస్త్రవేత్తల సూచనల మేరకు రసాయన క్రిమి సంహారకాలు వాడాలి.

రైతులు గ్రామాలలో జరిగే వివిధ వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలలో విరివిగా పాల్గొని, పంటల సాగుకు సంబంధించి తాము ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలకు పరిష్కారాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ అధికారుల ద్వారా తెలుసుకొని తద్వారా రాష్ట్ర రైతాంగం సస్యరక్షణ మందులను అవసరం మేరకే వాడుతూ, సాగు నీటిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు, మనకున్న సహజ వనరులను కాపాడుకుంటూ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని కోరుకుంటున్నాను.

పి.రాంబాబు
(పి. రాంబాబు)




రాష్ట్రంలో వరి నాట్లు సకాలంలోనే వేయడం జరిగింది. కొన్ని ప్రాంతాలలో కూలీల సమస్య వలన ముదురు నారు వేయవలసిన అవసరం వుంటుంది. అలానే ఎక్కువ విస్తీర్ణంలో నేరుగా వరి విత్తడం జరిగింది. ఈ నేపథ్యంలో వరి సాగుకు ఈ క్రింది సూచనలు చేయడం జరుగుచున్నవి.

- సార్వాలో సెప్టెంబరు నెలలో నాట్లు వేయవలసిన ప్రాంతాలలో స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలి.
- దీర్ఘకాలిక రకాలను ఆగష్టు మాసంలో నాటినప్పుడు వీలైనంత వరకు లేత నారును (25-35 రోజుల) నాటుకోవాలి.
- ముదురు నారు (35-60 రోజుల నారు) నాటవలసి వస్తే నాట్లను దగ్గర దగ్గరగా చ.మీ. 44 కుదుళ్ళు, ప్రతి కుదురుకి 4-5 నారు మొక్కలు వుండేటట్లు నాటుకోవాలి.
- కాలిబాటలు 2-3 మీటర్లకు విధిగా వుండేటట్లు చూసుకోవాలి.
- సిఫారసు చేసిన నత్రజనిని మూడు సమ భాగాలుగా మొదటి సారి నాటటానికి ముందు, రెండవ సారి పిలకల దశలో మరియు ఆఖరుగా అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. పొటాష్‌లో సగ భాగాన్ని మొదటి దఫాలో మరియు మిగతా సగాన్ని అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి.

దక్షిణాంధ్ర జిల్లాలలో మరియు ఇతర ప్రాంతాలలో ఏప్రియల్ 15 నుండి మే నెల 15 వరకు నార్లు పోసుకొని మరియు నేరుగా విత్తే విధానం ద్వారా సాగు చేసిన వరి పైరు ఆగష్టు నెలలో వెన్ను తీసే దశ నుండి కోత కోసే దశలో వుంటుంది.

- ఈ దశలో పైరుకు నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.
- ఈ దశలో కాండం తొలుచు పురుగు, దోమపోటు పురుగు మరియు ఆకుముడత పురుగు పైరును ఆశించి నష్టం కలుగజేస్తుంది. దీనికి నివారణ చర్యలు చేపట్టాలి.

### వరిలో కలుపు యాజమాన్యం

- ప్రధాన పొలంలో నాట్లు వేసిన 3-5 రోజులలోపు ఎకరాకు 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ లేదా 35-50 గ్రా. ఆక్సా డయార్జిల్ లేదా 1.5 లీటర్లు బుటాక్లోర్ మందును 25 కిలోల పొడి ఇసుకలో కలిపి సమానంగా చల్లుకోవాలి లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ + ప్రిటిలాక్లోర్ గుళికలు 4 కిలోలు చొప్పున సమానంగా పడేలా చల్లాలి.
- ఊడ్చిన 15-20 రోజులకు గడ్డిజాతి కలుపు మొక్కలు ఎక్కువ వున్నట్లయితే సైహలోఫప్ బ్యుటైల్ 10% ద్రావకం 2 మి.లీ. ఒక లీటరు నీటికి లేదా బిస్పైరిబాక్ సోడియం 10% ద్రావకం లీటరు నీటికి 0.4 మి.లీ. చొప్పున ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలి. వెడల్పాటి ఆకులున్న కలుపు మొక్కలు ఉన్నట్లయితే నాటిన 20-25 రోజులలోపు ఎకరానికి 400 గ్రా. 2,4-డి. సోడియం సాల్ట్ 80% పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి
- అదే నేరుగా విత్తే వరి విధానంలో అయితే ఎకరాకు 80 గ్రా. పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ కలుపు మందును ఇసుకలో కలిపి 5-7 రోజులలో వేసుకోవాలి.
- గడ్డిజాతి మొక్కలు, వెడల్పాటి కలుపు మొక్కలు రెండూ సమానంగా వున్నట్లయితే నాటిన 15-25 రోజుల సమయంలో ఎకరానికి 100 మి.లీ. బిస్‌పైరిబాక్ సోడియం లేదా నాటిన 25-30 రోజులప్పుడు 8 గ్రా. మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ + క్లోరోమ్యూరాన్ ఇథైల్ మందును పిచికారి చేసుకోవాలి.

### చీడ పీడల సస్యరక్షణ చర్యలు

ఆగష్టు నెలలో ప్రధానంగా తాటాకు పురుగు (హిస్పా) మరియు కాండం తొలుచు పురుగులు ఆశించే అవకాశం వున్నది.

- **తాటాకు పురుగు** ఆశించడం వలన ఆకుల చివర్లు పాలిపోయి, చిట్లిపోతాయి. ఆకుల మధ్య ఈనెకు ఇరువైపులా తెల్లని నిచ్చెన లాంటి చారలు ఏర్పడతాయి. నివారణకు గట్ల మీద వుండే కలుపు మొక్కలు, అతిథేయి మొక్కలను నాశనం చేయాలి. దుబ్బుకు రెండు నష్టపోయిన ఆకులున్నచో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ప్రొఫినోఫాస్ 2.0 మి.లీ./ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

- **కాండం తొలుచు పురుగు** ఆశించడం వలన మొక్కలోని మొవ్వు ఆకు చనిపోయి చేతితో లాగితే సులభంగా ఊడివస్తుంది. దీనినే "మొవ్వు చనిపోవడం" అంటారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఆర్థిక నష్ట సహన పరిమితి (ప్రతీ చదరపు మీటరుకు ఒక గ్రుడ్ల సముదాయం లేదా ఒక ఆడ రెక్కల పురుగు లేదా 5 శాతం చనిపోయిన మొవ్వులు గమనించినపుడు, మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ./ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ఎలుకల నివారణ**

ఆగష్టు మాసంలో వరి పైరు నాట్లు వేసిన దశ నుండి పైరు ఎదిగే దశలో వుంటుంది. ఈ సమయంలో ఎలుకలు పొలం గట్లపై స్థిర నివాసం ఏర్పరచుకొనుటకు ప్రయత్నిస్తూ బయట నుండి పొలాల్లోనికి వలస వస్తుంటాయి. వీటి నివారణకు గాను

- పొలం గట్లపై ఎకరాకు 20 చొప్పున తాటాకు బుట్టలను పెట్టి దానిలో ఎర వుంచిన ఎడల వచ్చే ఎలుకలను నియంత్రించవచ్చు.
- పొలం గట్లపై ఎర స్థావరాలను (పి.వి.సి. పైపు) ఎకరాకు 8-10 వరకు ఏర్పరచుకొని దాని ద్వారా బ్రోమోడయాలిన్ విషపు ఎరను ఎలుకలకు అందించాలి.
- ఎలుకలున్న కన్నాలను గుర్తించి దానిలోనికి పొగ బారించడం ద్వారా ఎలుకలను నిర్మూలించవచ్చు.

**డా॥ టి. శ్రీనివాస్,** ప్రధాన శాస్త్రవేత్త (వరి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
మారుటేరు - 534 122. చరవాణి : 93968 48380




- ప్రత్తి విత్తిన వెంటనే లేదా విత్తిన 48 గంటల లోపల పెండిమిథాలిన్ 1.5-2.0 లీ./ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి నేలంతా తడిచేటట్లు పిచికారి చేయటం వలన విత్తిన 20 రోజుల వరకు కలుపును సమర్ధవంతంగా నివారించ వచ్చు.
- బి.టి. ప్రత్తికి ఎకరాకు 48-60 కిలోల నత్రజని (3 బస్తాల యూరియా), 24 కిలోల భాస్వరం (3 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్పేట్) మరియు 24 కిలోల పొటాష్ (40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) పోషకాలను అందించాలి. ఆఖరు దుక్కిలో సిఫారసు చేసిన భాస్వరపు ఎరువును మొత్తం వేసుకోవాలి. తర్వాత వేసే భాస్వరపు ఎరువు పైరుకి అందదు. వీలైనంత వరకు సూటి ఎరువులను వాడుకోవాలి.
- ప్రత్తి పంట విత్తుకున్న వెంటనే పొలం చుట్టూత నాలుగు లేదా ఐదు వరుసల జొన్న కాని మొక్కజొన్న కాని విత్తుకోవటం వలన రసం పీల్చే పురుగులను అడ్డుకొనవచ్చు.
- విత్తిన 25-30 రోజులప్పుడు అంతరకృషి చేయడానికి అవకాశం లేనప్పుడు గడ్డి జాతి మొక్కల నివారణకు ఎకరాకు 400 మి.లీ. క్విజలోఫాప్ ఇథైల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. వెడల్పాటి ఆకు కలుపు సమస్య ఎక్కువగా వున్నట్లైతే ఎకరాకు 250 మి.లీ. పైరిథయోబ్యాక్ సోడియంను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- ప్రత్తి విత్తిన 20-30 రోజులకు మొదటి దఫా సిఫారసు చేసిన నత్రజని మరియు పొటాష్ (ఎకరానికి 50 కిలోల యూరియా + 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) ఎరువులను నేలలో సరిపడినంత తేమ ఉన్నప్పుడు పై పాటుగా వేసుకుని అరకలతో అంతర కృషి చేసుకోవాలి.
- విత్తిన 20-30 రోజులప్పుడు అంతర కృషి చేయడం వలన కలుపు నివారణ మరియు నేలలో తేమ సంరక్షణ జరుగుతుంది.
- మెగ్నీషియం ధాతు లోపించినపుడు ముదురు ఆకులు, అంచుల నుండి మధ్య భాగానికి పసుపు రంగుకు మారతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా వుంటాయి. లోప తీవ్రత పెరిగినపుడు ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయి. సాధారణంగా ఈ లోపం పొటాషియం ఎక్కువగా ఉన్న నేలల్లో కనిపిస్తుంది. మెగ్నీషియం లోప నివారణకు లీటరు నీటికి 10 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్‌ను పైరు వేసిన 45 మరియు 75 రోజుల తరువాత రెండుసార్లు పిచికారి చేయాలి.
- జింకు ధాతువు లోపించినపుడు ఆకుల ఈనెలు ఆకుపచ్చగా వుండి ఈనెల మధ్య భాగం మాత్రమే పసుపు పచ్చగా

మారుతుంది. కొమ్మ చివరి ఆకులు చిన్నవిగా వుండి ముడతలు పడి కణుపుల మధ్య దూరం తగ్గుతుంది. జింకు లోపం వున్న నేలల్లో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్‌ను ఆఖరు దుక్కిలో వేసుకోవాలి లేదా 2.0 గ్రా./లీ. జింకు సల్ఫేట్ ద్రావణాన్ని మొక్కల మీద లోప లక్షణాలు గమనించినప్పుడు 7-10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయటం ద్వారా లోపాన్ని సవరించుకోవచ్చు.

- పంట తొలి దశలలో పచ్చదోమ, పేనుబంక మరియు తామర పురుగుల ఉధృతి అధికంగా ఉంటుంది. విత్తిన 40 నుండి 50 రోజుల దశలో 1500 పి.పి.యం. వేప నూనె ఒక లీటరు ఎకరానికి పిచికారి చేయటం వలన తొలి దశలో ఆశించే రసం పీల్చే పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు.
- రసం పీల్చు పురుగులను అదుపు చేయటానికి కాండం మీద మందు పూత పద్ధతిని పాటించాలి. విత్తిన 30 మరియు 45 రోజులకు మోనోక్రోటోఫాస్ 1:4 నిష్పత్తిలో వాడాలి (1పాలు మందు, 4పాళ్ళ నీళ్ళు) మరియు 60 రోజుల వయస్సులో ఇమిడాక్లోప్రిడ్ 1:20 నిష్పత్తిలో వాడాలి. కాండం పూత పద్ధతి ద్వారా పచ్చదోమ, పేనుబంక, పిండినల్లి పురుగులను ఎటువంటి పురుగు మందుల పిచికారి లేకుండా తక్కువ ఖర్చుతో అదుపు చేసుకోవచ్చును. అంతేకాకుండా పురుగు మందులను పిచికారి చేయకపోవటం వలన తొలిదశలో మిత్ర పురుగుల సంతతి పెరిగి చీడపీడలను అదుపు చేయడంలో సహకరిస్తాయి.
- ఆర్థిక నష్ట పరిమితిని అనుసరించి రసం పీల్చు పురుగుల నివారణకు లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 200 యస్.ఎల్. 0.4 మి.లీ. లేదా ఎసిటామాప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. కలిపి పిచికారి చేయాలి. విత్తిన 60 రోజుల వరకు నియో నికోటినైడ్ మందులైన టువంటి ఇమిడాక్లోప్రిడ్, ఎసిటామాప్రిడ్ మరియు థయోమిథాక్సామ్ మందులను పిచికారి చేయరాదు.
- అధిక వర్షాల వలన నేలలో తేమ శాతం పెరిగినప్పుడు వేరుకుళ్ళు ఆశించటానికి ఆస్కారమున్నది. తెగులు సోకిన పాదులతో పాటు చుట్టూ వరసలోని మొక్కలను, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి వేరు మండలం తడిచేలా పోయాలి. దీని వలన తెగులు వ్యాప్తిని అరికట్టవచ్చు.

**డా॥ యం. సుధారాణి,** ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
లాం, గుంటూరు - 522 034. చరవాణి : 99896 25207




**మినుము మరియు పెసర :**

**అంతరకృషి :** జూన్ ఆఖరిలో లేదా జులైలో వేసిన పంటలో అంతరకృషి చేయవలెను.

**సస్యరక్షణ :**

**తామర పురుగులు :** ఈ పురుగు పైరు లేత దశలో ఎక్కువగా ఆశించి ఆకులలో రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగ చేయటమే కాకుండా ఆకుముడత అనే వైరస్ వ్యాధిని వ్యాపింపచేస్తాయి. దీని నివారణకు ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెల్లదోమ :** ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చుటమే గాక పల్లాకు తెగులును కూడా వ్యాపింప చేస్తాయి. వీటి నివారణకు ఒక లీటరు నీటికి 0.2 గ్రా. అసిటామిప్రిడ్ కలిపి పిచికారి చేయాలి.

**మారుకా మచ్చల పురుగు :** మినుము మరియు పెసర పూత దశలో 'మారుక' అను గూడు పురుగు ఆశించే అవకాశము ఉంది. దీని నివారణకు లీటరు నీటికి నొవల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఫ్లుబెండిఎమైడ్ 0.2 మి.లీ. మందును పిచికారి చేస్తే పురుగును నివారించుకోవచ్చు. అవసరమయితే వారం రోజుల తరువాత మరల పిచికారి చేయాలి.

**మినుము మరియు పెసరలో వచ్చు తెగుళ్ళ నివారణ :**

**తలమాడు లేదా మొవ్వుకుళ్ళు :** ఇది వైరస్ వల్ల కలిగే తెగులు. దీని వ్యాప్తికి తామర పురుగులు దోహదపడతాయి. ముఖ్యంగా

బెట్ట వాతావరణంలో ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. మొక్క పెరిగే తల భాగం మాడి మొక్కలు ఎండిపోతాయి. ఆకుల అంచులు వెనకకు ముడుచుకొని గిడసబారి రాలిపోతాయి. ఈనెలు రక్త వర్ణంకు మారతాయి. ఈ తెగులును నివారించాలంటే తామర పురుగులను నియంత్రించాలి. ఒక అడుగు ఎత్తులో నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 20 ఉంచినట్లైతే తామర పురుగుల ఉధృతిని తెలుసుకొనవచ్చును.

**పల్లాకు తెగులు (ఎల్లో మొజాయిక్) :** పల్లాకు తెగులు సోకిన మొక్కలను మరియు ఇతర కలుపు మొక్కలను పీకి నాశనము చేయవలెను. పైరుపై ఒక అడుగు ఎత్తులో పసుపు రంగు అట్టలను ఉంచి తెల్లదోమ ఉధృతిని తెలుసుకొనవచ్చును. తెల్లదోమను నియంత్రించాలి.

### కంది

ఆలశ్యంగా విత్తుకోవటానికి కంది పైరు అనుకూలం.

**రకాలు :** ఎల్.ఆర్.జి. 105, ఎల్.ఆర్.జి. 133-33, టి.ఆర్.జి. 59, ఎల్.ఆర్.జి. 52, ఐ.సి.పి.ఎల్. 85063 (లక్ష్మి), ఐ.సి.పి. 8863 (మారుతి), ఐ.సి.పి.ఎల్. 87119 (ఆశ).

**విత్తు సమయం :** ఆగష్టు ఆఖరు వరకు విత్తుకోవచ్చును. విత్తుట ఆలశ్యం అయినట్లయితే నేల తీరును బట్టి సాళ్ళ మధ్య దూరం తగ్గించి, మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండేటట్లు విత్తుకోవాలి.

**ఎరువులు :** నత్రజని 20 కిలోలు, భాస్వరం 50 కిలోలు హెక్టారుకు దుక్కిలో వేయవలెను. సూటి ఎరువులు అయినటువంటి యూరియా మరియు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వాడవలెను.

**డా॥ యం. వి. రమణ,** ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం. లాం, గుంటూరు.
చరవాణి నెం : 99896 25215

## చెఱకు



- వర్షాకాలంలో చెఱకు తోటల్లో నీరు నిలబడకుండా మురుగు నీటి కాలువల ద్వారా పంట పొలం నుండి వర్షపు నీటిని తీసివేయాలి.
- డిసెంబరు - జనవరిలో నాటిన మొక్క తోటలకు మరియు మోడెం తోటలకు మొక్కల మొదళ్ళకు మట్టిని ఎగద్రోయాలి.
- తోట ఎదుగుదలను బట్టి జడచుట్లు వేసి అధిక వర్షాలకు మరియు ఈదురు గాలులకు తోటలు పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. చెఱకు తోట 1.5 మీ. ఎత్తు ఎదిగిన తరువాత మాత్రమే జడచుట్లు వేయాలి. మొవ్వులోని 8 పచ్చటి ఆకులను వదిలి క్రింది ముదురు ఆకులతోనే జడచుట్లు వేయాలి.
- జడచుట్లు వేసేటప్పుడు ప్రతి 10 మీటర్ల దూరానికి జడను ముడి వేసి కొత్త జడచుట్టు మొదలు పెట్టాలి.
- ఉత్తర కోస్తాలో వర్షాధారంగా జూన్ మాసంలో నాటిన చెఱకు తోటలకు రెండవ దఫా నత్రజని, జూలై మాసంలో నాటిన తోటలకు మొదటి దఫా నత్రజని ఎరువును (ఎకరానికి 35 కిలోల యూరియా) భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు మొక్కలకు దగ్గరగా గుంతలు తీసి ఎరువు వేసి మట్టిని కప్పాలి.
- కాండం తొలుచు పురుగు ఉనికిని గమనించి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4 మి.లీ. / లీటరు నీటికి కలిపి మొవ్వ బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి.
- దీర్ఘకాలిక బెట్ట పరిస్థితుల్లో పంట దశను, ఎదుగుదలను బట్టి లీటరు నీటికి 25 గ్రా. యూరియా + 25 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను కలిపి పంటపై పిచికారి చేయాలి.
- వర్షాకాలంలో పంట పొలంలో అధిక నత్రజని వాడకం మరియు మురుగు నీరు నిలబడిపోవడం వలన చెఱకును ఆశించే పొలుసు పురుగు, దూదేకుల పురుగు, తెల్లదోమ, పేను బంక ఉధృతిని గమనించి, ముదురు ఆకులను రెలచి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. మందును లీటరు నీటికి చొప్పున కలిపి పంట బాగా తడిచే విధంగా పిచికారి చేయాలి.

**డా॥ టి. చిత్కళా దేవి,** ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు),
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, అనకాపల్లి.
చరవాణి : 99896 25216




- రాష్ట్రంలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం నమోదైంది. మొక్కజొన్న లేత దశలో నీటి ముంపును తట్టుకోలేదు. కాబట్టి పంట లేత దశలో ఉన్నట్లయితే నీటి ముంపుకు గురి కాకుండా చూసుకోవాలి. ఎక్కువ వర్షపాతం నమోదైన ప్పుడు ముంపు పరిస్థితిని నివారించుటకు పొలం నుండి వర్షపు నీరును మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీయాలి.
- జూన్ మాసంలో విత్తుకున్న మొక్కజొన్న పైరు పూత దశలో, జూలై నెలలో విత్తుకున్న మొక్కజొన్న పైరు మోకాలెత్తు దశలో ఉంటుంది. రైతులు ఈ క్రింది సూచించిన యాజమాన్య మరియు సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.
- 30-35 రోజుల వయసున్న పైరులో అంతరకృషి జరిపి రెండవ దఫా అంటే ఎకరాకు 26 కిలోల నత్రజని ఇచ్చే ఎరువును పైపాటుగా వేసుకుని మట్టిని మొక్కల వేర్ల పైకి ఎగదోయాలి. పూత దశలో ఉన్న పైరుకు మూడవ దఫాగా 26 కిలోల నత్రజనిని ఇచ్చే ఎరువుతో పాటు 10 కిలోల పొటాష్ ఎరువును వేసుకోవాలి.
- పైరులో జింకు లోపం ఏర్పడి, ఆకులు పసుపు రంగులోకి మారడం లేదా లేత పైరు తెల్ల మొగ్గగా మారడం గమనించినప్పుడు లీటరు నీటికి 2.0 గ్రాములు చొప్పున జింకు సల్ఫేట్‌ను కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
- పైరుతో పాటుగా మొలచి పెరుగుతున్న కలుపు మొక్కలు నివారణకు సాళ్ళ మధ్య అంతరకృషి చేయాలి. అంతరకృషి చేయటానికి అవకాశం లేని చోట్ల కలుపు మందులు ఉపయోగించి కలుపు నివారణ చేపట్టవచ్చు. టెంబోట్రియాన్ 34.4% ఎస్.సి. 115 మి.లీ. మరియు అట్రాజిన్ 50% డబ్ల్యు.పి. 400 గ్రా. మందును ఎకరానికి మొక్కజొన్న విత్తిన 15-18 రోజులకు లేదా కలుపు 4 ఆకుల దశలో పిచికారి చేసి అన్ని రకాల కలుపు మొక్కలను నివారించ వచ్చు.
- కత్తెర పురుగు (ఫాల్ ఆర్మీ వార్మ్) ఉధృతి మొక్కజొన్న పండించే ప్రాంతాలలో కనబడుతుంది. ఈ పురుగు ఆకులు, కాండం భాగాలను విరివిగా తినడం చేత అపారమైన నష్టం కలుగచేస్తుంది. పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ సమర్ధవంతమైన మరియు సిఫారసు చేయబడిన రసాయనిక మందులతో నివారణ చర్యలు చేపట్టటం అత్యవసరం. 31-50 రోజుల లోపు మొక్కజొన్న పైరులో పురుగు ఉధృతి ఎక్కువగా ఉండి అపార నష్టం కలుగ జేస్తుంది. ఎమామేక్టిన్ బెంజోయేట్ మందును 0.4 గ్రా. లేదా స్పైనోసాడ్ 45 ఎస్.సి. 0.3 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి ఆకుల సుడులు బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి. పురుగు తీవ్రతను ప్రతి 10-12 రోజులకు గమనిస్తూ పైన తెలిపిన మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.
- పొడ తెగులు ఆసించినచో నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన ఆకులను తీసివేయాలి. కలుపు లేకుండా శుభ్రమైన పంట సాగు అవలంభించాలి. నివారణకు ప్రోపికొనజోల్ 1 మి.లీ. లేదా కార్బండెజిమ్ 1 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఆకుమాడు/ఆకు ఎండు తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**డా॥ ఐ. సుధీర్ కుమార్,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం)
వ్యవసాయ పరిశోధనా స్థానం, పెద్దాపురం.
చరవాణి : 99597 92568




**జొన్న :**

- జొన్న పంటలో కలుపు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉంటే కలుపును తీయించాలి.
- పంట విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు 12 కిలోల నత్రజనినిచ్చు ఎరువును పై పాటుగా వేయాలి.

- జొన్న పైరులో 30 రోజుల తర్వాత నుండి పంట కోసే వరకు కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు విత్తిన 35-40 రోజులలోపు ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను కాండపు సుడుల్లో వేయాలి.

**సజ్జ :**

- సజ్జ పంట విత్తిన 30 రోజుల తర్వాత దంతితో అంతరకృషి చేస్తే భూమిలో తేమ నిలిచి బాగా పెరుగుతుంది.
- అంతరకృషి చేసిన తర్వాత భూమిలో తేమ ఉన్నప్పుడు ఎకరాకు 10 కిలోల నత్రజనినిచ్చు ఎరువును పైపాటుగా వేయాలి.
- వెర్రికంకి తెగులు లేత మొక్కలపై ఆశించినప్పుడు ఆకులు పసుపు రంగుగా మారి అడుగు భాగాన తెల్లని బూజు ఏర్పడుతుంది. దీని నివారణకు రిడోమిల్ 25% డబ్ల్యూ.పి. మందును 1 గ్రా. / లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారి చేయాలి.

**రాగి :**

- విత్తిన / నాటిన రెండు వారాల లోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి.
- విత్తిన / నాటిన 3 వారాల లోపు కలుపు మొక్కలను తీసివేయాలి. నాటిన 30 రోజుల తర్వాత వెడల్పాకు కలుపు మొక్కలను నివారించడానికి ఎకరాకు 400 గ్రా. 2,4-డి సోడియం సాల్ట్ 80% పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- పైరు నాటిన 30 రోజులకు ఎకరాకు 12 కిలోల నత్రజనినిచ్చు ఎరువును పైపాటుగా వేయాలి.
- పైరులో అగ్గి తెగులు ఆశించినప్పుడు లీటరు నీటికి 1 గ్రా. కార్బండెజిమ్ లేదా 0.6 గ్రా. ల ట్రైసైక్లోజోల్ మందును కలిపి పిచికారి చేయాలి.
- బెట్ట ఎక్కువగా ఉంటే పేనుబంక ఎక్కువగా ఆశిస్తుంది. కావున దీనిని నివారించడానికి డైమిథోయేట్ మందును ఒక లీటరు నీటికి 2 మి.లీ. వంతున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

**కొర్ర :**

- విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి. విత్తిన 30 రోజుల వరకు పొలంలో కలుపు మొక్కలు రాకుండా తీయించాలి.
- విత్తిన 3-4 వారాల తర్వాత ఎకరాకు 8 కిలోల నత్రజనినిచ్చు ఎరువును పైపాటుగా వేయాలి.
- విత్తిన / నాటిన 3 వారాలలోపు కలుపు మొక్కలను తీసివేయాలి. నాటిన 30 రోజుల తర్వాత వెడల్పాకు కలుపు మొక్కలను నివారించడానికి ఎకరాకు 400 గ్రా. 2,4-డి సోడియం సాల్ట్ 80% పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**సామ / వరిగ / ఊద / ఆరిక / అండుకొర్ర :**

ఖరీఫ్‌లో ఈ పంటలను వర్షాధారంగా జూన్ నుండి ఆగష్టు వరకు విత్తుకోవచ్చు.

**విత్తన మోతాదు :** ఎకరాకు 4 కిలోల విత్తనం సరిపోతుంది.

**విత్తన శుద్ధి :** ఒక కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండెజిమ్ లేదా 3 గ్రా. కాప్టాన్ / థైరామ్ కాని కలిపి విత్తుకోవాలి.

**విత్తడం :** విత్తనాన్ని వరుసల మధ్య 22.5 సెం.మీ. మరియు మొక్కల మధ్య 10 సెం.మీ. ఎడంగా గొర్రుతో విత్తుకోవాలి. అండుకొర్రకు మాత్రం వరుసల మధ్య 45 సెం.మీ. మరియు మొక్కల మధ్య 15 సెం.మీ. ఎడంగా గొర్రుతో విత్తుకోవాలి.

**ఎరువులు :** ఎకరానికి 2 టన్నుల పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. ఎకరాకు 8 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్‌ను విత్తేటప్పుడు వేయాలి.

**అంతరకృషి :** పంట తొలి దశలో కలుపు మొక్కలను నివారించడానికి ఐసోప్రొట్యూరాన్ మందును ఎకరాకు 400 గ్రా. 200 లీటర్ల నీటిని కలిపి విత్తిన రెండు రోజుల లోపు నేలపై పిచికారి చేయాలి. విత్తిన రెండు వారాల లోపుగా ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేయాలి. విత్తిన తర్వాత 20-25 రోజుల మధ్యలో కలుపు మొక్కలను దంతితో అంతరకృషి చేసి తీసివేయాలి.

**డా|| యం. హేమంత్ కుమార్,**
ప్రధాన శాస్త్రవేత్త (చిరుధాన్యాలు)
వ్యవసాయ పరిశోధనా స్థానము, పెరుమాళ్ళపల్లె.
చరవాణి : 99896 25227




- వేరుశనగ పంటలో మొలచిన, వెడల్పు ఆకుల కలుపు మెక్కలు 2 లేక 3 ఆకుల దశలో ఉన్నప్పుడు నివారణకు కలుపు నాశిని మందు ఇమజితపిర్ 300 మి.లీ., గడ్డి జాతి కలుపు నివారణకు క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ. ను 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారి చేయాలి. మోతాదుని మించి కలుపు మందును వాడినచో పంటకు హాని జరుగును.
- వేరుశనగ విత్తిన 35-45 రోజులలోపు వూడలు దిగే సమయములో ఎకరానికి 200 కిలోల జిప్సంను చెట్ల మొదళ్ళ దగ్గర వేయాలి. ఇందులోని సున్నము కాయ సైజును, గంధకము గింజలో నూనె మోతాదుని పెంచి కాయ నాణ్యతకు తోడ్పడుతుంది.
- వేరుశనగ తొలి పూత దశలో క్రొత్త కొమ్మలు, క్రొత్త పూత రావటానికి ఎకరానికి 10 కిలోల యూరియాను చల్లాలి.
- సూక్ష్మ ధాతువుల లోపాలను సవరించడానికి మార్కెట్టులో లభ్యమయ్యే ఫార్ములా - 4 లేదా మాక్స్ సూక్ష్మ ధాతువు అర కిలో పొడిని 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారి చేయాలి. ఈ పొడిని ఇతర కీటక నాశిని లేదా తెగుళ్ల నివారణ మందులతో కలపకూడదు.

**పురుగులు :**

- సాధారణంగా ఆగస్టు మాసంలో ఖరీఫ్ వర్షాధారిత లేదా నీటి వసతి క్రింద వేసిన వేరుశనగ పంట పై కాయ తొలిచె లద్దె పురుగు, పచ్చ పురుగు, ఆకు ముడుత పురుగులు ఎక్కువగా ఆశించే అవకాశము వుంటుంది.
- ఆకు ముడుత పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పొలంను దూరం నుండి చూసినట్లయితే కాలిపోయినట్లు కనిపిస్తుంది. అందుకే దీనిని అగ్గి తెగులు అంటారు. ఈ పురుగు ఉనికి కొరకు పొలములో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. ఆకుముడుత పురుగు పై 50 శాతము కన్నా ఎక్కువ పరాన్న జీవులు లేదా శిలీంద్రాలు ఆశించినట్లయితే ఎలాంటి పురుగు మందులు వాడే అవసరం లేదు. ఆకుముడుత నివారణకు మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. లేదా క్వినాల్ఫాస్ 400 మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రా. లేదా క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారి చేయాలి.
- లద్దె పురుగు, శనగ పచ్చ పురుగు మరియు ఆకుముడుత పురుగుల నివారణ కొరకు 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప సంభంధిత పురుగు మందు 1500 పి.పియం. 1000 మి.లీ. ను 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారి చేయాలి. పిల్ల పురుగుల నివారణకు క్వినాల్ఫాస్ 400 మి.లీ., ఎదిగిన పురుగు నివారణకు థయోడికార్బ్ 200 గ్రా. లేదా నొవల్యూరాన్ 200 మి.లీ. లేదా ఫ్లుబెండియమైడ్ 30 గ్రా. మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారి చేయాలి. ఎదిగిన లద్దె పురుగుల నివారణకు విషపు ఎరను (500 మి.లీ. క్వినాల్ఫాస్, 500 గ్రా. బెల్లం, 10 కిలోలు వరి తవుడు / ఎకరానికి) ఉపయోగించి కూడా నివారించవచ్చు.

**తెగుళ్ళు :**

- ఈ సమయంలో లేత ఆకుమచ్చ, ముదురు ఆకుమచ్చ తెగుళ్ళు మరియు త్రుప్పు తెగుళ్ళు ఆశించే అవకాశము వుంది. కావున పంటపై తెగుళ్ళ లక్షణాలు కనిపించిన వెంటనే మాంకోజెబ్ 400 గ్రా. లేదా కార్బండెజిమ్ 200 గ్రా. లేదా హెక్సాకోనజోల్ 5 యస్.సి. 400 మి.లీ. లేదా టెబ్యుకోనజోల్ 25.9 ఇ.సి. 200 మి.లీ. మందును 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారి చేయాలి.
- కాండం కుళ్ళు మరియు మొవ్వ కుళ్ళు వైరస్ తెగుళ్ళ నివారణకు అన్ని రకాలైన కలుపు మొక్కలను పూత దశకు చేరక మునుపే తీసివేయాలి. పంటపై డైమిథోయేట్ 400 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 17.8 యస్.యల్. 60 మి.లీ. మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారి చేయాలి.

**డా॥ కె.యస్.యస్. నాయక్**
ప్రధాన శాస్త్రవేత్త (వేరుశనగ),
వ్యవసాయ పరిశోధనా స్థానం, కదిరి.
చరవాణి : 99896 25217




- జూన్ రెండవ పక్షం నుండి జూలై రెండవ పక్షం వరకు విత్తిన ప్రొద్దు తిరుగుడు పంట ప్రస్తుతం 20–25 రోజుల దశలో ఉంటుంది. ఈ దశలో గొర్రుతో అంతరకృషి చేపట్టాలి.
- 30 రోజుల పంట దశలో నత్రజని పోషకాన్ని యూరియా రూపంలో ఎకరానికి 13 కిలోల చొప్పున పైపాటుగా వేసుకోవాలి.
- బరువు నేలల్లో వర్షాధారం క్రింద ఈ పంటను ఆగష్టు 15 వరకు విత్తుకోవచ్చు.
- వర్షాభావ పరిస్థితులలో రసం పీల్చు పురుగుల నివారణకు ఎకరానికి 20 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి. తామర పురుగుల ఉధృతి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు మరియు వర్షాకాలంలో ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. పంటపై ఈ తెగులును గమనించినట్లైతే క్వింటాల్ (ఇప్రోడియోన్ 25% + కార్బండెజిమ్ 25%) లేదా సాఫ్ (కార్బండెజిమ్ 12% + మాంకోజెబ్ 63%) 2 గ్రా. లేదా ప్రొపికోనజోల్ 25% ఇ.సి. 1 మి.లీ. లేదా టాస్ప్ (డైఫెన్‌కోనజోల్ 25% + ప్రొపికోనజోల్ 25%) 0.25 గ్రా. లీటరు నీటికి కలిపి 15–20 రోజుల వ్యవధిలో పిచికారి చేసుకోవాలి.
- వర్షాలు అధికంగా పడినప్పుడు తలకుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లీటరు నీటికి కలిపి పువ్వు దశలో 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.

**డా॥ బి.వి. రవి ప్రకాష్ రెడ్డి,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం)
చరవాణి : 99666 65434
**డా॥ కె. వెంకటరమణమ్మ,**
సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల తెగుళ్ళ శాస్త్రం)
చరవాణి : 99088 29618
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల.




- జూన్ మాసంలో వేసిన ఆముదము పంట ప్రస్తుతము 30–40 రోజుల వయసులో శాఖీయ దశ నుండి పూత దశ వరకు ఉంటుంది. ఈ దశలో పై పాటుగా 6 కిలోల నత్రజని (13 కిలోలు యూరియా ఎకరానికి) పై పాటుగా వేసుకోవాలి .
- జులై మాసం నందు వేసిన ఆముదము పంటలో 15–20 రోజుల తర్వాత కణుపుకు ఒక మొక్క ఉండే లాగా ఒత్తు మొక్కలను పీకి వేయాలి. అదే సమయంలో మొలవని చోట కొత్త గింజను విత్తుకోవాలి.
- మొక్కలు మొలిచిన చోట 20 రోజులకు అంతర కృషితో పాటు ప్రతి చాలుకు తేమ సంరక్షణ చాలు వేసుకున్నట్లు అయితే తేమ మరియు మట్టి సంరక్షణ జరిగి పంట ఎదుగుదలకు మరియు బెట్ట పరిస్థితులను తట్టుకోవడానికి ఉపయోగపడుతుంది.
- పంట 25–30 రోజులు ఉన్న చోట కలుపు నివారణకు గుంటక లేదా గొర్రుతో అంతర కృషి చేసుకోవాలి.
- గాలిలో మరియు నేలలో తేమ అధికంగా ఉన్నప్పుడు లేదా నీరు నిలువ ఉండే ప్రదేశాలలో మొలక కుళ్ళు తెగులు సోకి ఆకులు వాడి కుళ్ళిపోయి మొక్కలు చనిపోయే

అవకాశం వుంది. తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మెటలాక్సిల్ పొడి మందును 2 గ్రాముల చొప్పున ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలి.

- ఆముదము పంట విత్తిన 20-60 రోజుల మధ్య కాలంలో వడలు తెగులు / ఎండు తెగులు ఎక్కువగా రావడానికి ఆస్కారముంది. లేత దశలో తెగులు సోకినట్లయితే మొక్కలు వడలిపోయి, బీజ పత్రాలు రంగును కోల్పోయి, పాలిపోయి తర్వాత మొక్కలు చనిపోతాయి. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే కార్బండెజిమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర భూమిని తడపాలి. తెగులు సోకి చనిపోయిన మొక్కలను ఎప్పటికప్పుడు పొలం నుండి తొలగించి నాశనం చేయాలి. తెగులును తట్టుకునే వంగడాలైన పి.సి.హెచ్.-111, పి.సి.హెచ్.-222, డి.సి.హెచ్.-177, డి.సి.హెచ్.-519 లేదా ఐ.సి.హెచ్.-66 లాంటి రకాలను ఎన్నుకొని విత్తుకోవాలి.

**డా॥ ఎ.వి.ఎస్. దుర్గాప్రసాద్,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం), చరవాణి : 95817 00298
**డా॥ వై. పవన్ కుమార్ రెడ్డి,** శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం)
వ్యవసాయ పరిశోధనా స్థానం. అనంతపురము.
చరవాణి : 99669 70300




- మే నెలలో వేసిన నువ్వు పంట, ఆగష్టు నెలలో పక్వానికి వస్తుంది.
- నువ్వు పంట పసుపుగా పాలిపోయినట్టు మారినప్పుడు కోత చేపట్టాలి.
- నువ్వు పంటలో కాండం నుంచి పైకి, కాయలు పక్వానికి వస్తాయి. కాబట్టి కాండం నుంచి 3 వ వంతు కాయలు పండగానే కోతను మొదలు పెట్టవచ్చు.
- కాయలో గింజలు గోధుమ రంగులోకి మారతాయి.
- ఇలా కోసిన పంటను కుప్పగా వేసుకొని 4-5 రోజులు ఉంచాలి.
- తరువాత కుప్ప తీసి ఎండ బెట్టుకోవాలి.
- ఇలా రెండు రోజులు ఆరబెట్టినాక గింజలు రాలిపోతాయి, వీటిని శుభ్రం చేసుకొని, ఎండలో ఎండబెట్టుకోవాలి.
- విత్తనం కోసం అయితే $40^0$ సెంటీ గ్రేడ్ మించిన ఎండలో విత్తనాన్ని ఎండ బెట్టకూడదు. విత్తనాన్ని నిల్వ ఉంచుకోడానికి 20 మి.లీ. వేప నూనె మరియు బూడిద కిలో విత్తనానికి కలిపి ఉంచుకోవాలి.
- తినే నువ్వులకు మాత్రం రసాయన మందులు కలుప కూడదు.

**డా॥ టి. తులసీ లక్ష్మి**
శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు అధిపతి,
వ్యవసాయ పరిశోధనా స్థానం, యలమంచిలి, విశాఖపట్నం జిల్లా.
ఫోన్ నెం. 89853 70076




పశుగ్రాస పంటలుగా జూలై మాసంలో విత్తుకొన్న ధాన్యపు జాతి పంటలలో, అధిక దిగుబడి సాధించడానికి రైతులు తప్పనిసరిగా నత్రజనిని పైపాటుగా వేసుకోవాలి. ముఖ్యంగా పశుగ్రాస మొక్కజొన్నను సాగు చేయునప్పుడు రైతులు నత్రజనిని యూరియా రూపంలో మూడు దఫాలుగా అందించాలి. పంటను విత్తినప్పుడు దుక్కిలో 52 కిలోలు, పంట మోకాలు ఎత్తు ఉన్నప్పుడు 26 కిలోలు మరియు పూతకు వచ్చినప్పుడు (టాసెలింగ్) 26 కిలోలు సమపాళ్ళలో అందించాలి. పశుగ్రాస జొన్న, పశుగ్రాస సజ్జ పంటలకు ఎకరాకు 26 నుండి 30 కిలోల యూరియాను విత్తిన 40 రోజుల తర్వాత వేసుకోవాలి. బహువార్షిక జొన్న పంటకు దుక్కిలో, విత్తిన 40 రోజులకు తరువాత ప్రతి కోత అనంతరం 35 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి. ఇందువలన నత్రజని పోషకాన్ని ఆవిరి

రూపంలో మరియు నీటిలో కరిగి నేలలో వృధాగా వెళ్ళిపోకుండా అరికట్టవచ్చును. దీని వలన పంటకు అవసరమైన పోషకాలు ముఖ్యంగా నత్రజనిని తగు పాళ్ళలో అందించుట వలన పంట ఎదుగుదలకు సహాయపడి అధిక పచ్చిమేత దిగుబడి సాధించడానికి అవకాశం ఉండును.

**డా॥ యస్. తిరుమల రెడ్డి,** శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి.
చరవాణి : 94920 73308




- వేరుశనగ, కంది, ప్రత్తి మరియు ఆముదము పంటలను వర్షాధారంగా సాగులో ఉన్నది. కంది, ప్రత్తి మరియు ఆముదము పంటల్లో నేల మరియు నీటి సంరక్షణ చాళ్ళు వాలుకు అడ్డంగా వరుసల మధ్యలో ట్రాక్టర్‌తో వేసుకోవాలి. అంతర సేద్యము ద్వారా కలుపును నివారించుకోవాలి.
- ఎర్ర నేలల్లో ముఖ్యంగా వేరుశనగ, కంది, ఆముదము, జొన్న, కొర్ర మరియు సజ్జ పంటలను ఆగష్టు నెలలో విత్తుకోవచ్చును.
- నల్లరేగడి నేలల్లో కంది మరియు ఆముదము పంటలను ఆగష్టు నెలలో విత్తుకోవచ్చును. ప్రత్తి పంటను ఆగష్టు మొదటి పక్షము వరకు విత్తుకోవచ్చు.
- వేరుశనగ పంటలో బెట్ట పరిస్థితులు ఉన్న యెడల 20 మి.మీ. రక్షక తడి ఇవ్వాలి. నీటి కుంటల్లో కానీ లేదా కాలువలు లేదా గొట్టపు బావుల్లోని నీటిని ఉపయోగించు కొని కనీసము ఒక తడి నీరు పెట్టాలి.
- ప్రత్తి మరియు ఆముదము పంటల్లో నీటి ఎద్దడి ఉన్న యెడల రక్షక తడి ఇవ్వవలెను.
- కంది పంటలో మొక్కకు మొక్కకు మధ్య 20 సెం.మీ.; ఆముదములో 60 సెం.మీ. దూరం ఉండేటట్లు పాటించాలి. వత్తుగా ఉన్న మొక్కలను పలుచన చేయాలి.
- నల్ల రేగడి నేలల్లో కంపార్టుమెంటల్ గట్లు ఏర్పరుచుకోవాలి. 5 మీ. × 5 మీ. దూరంలో బండ్ ఫార్మర్ ద్వారా గట్లు ఏర్పరుచుకోవాలి. పడిన వర్షపు నీరు బాగా నేలలో ఇంకి సంరక్షించబడి అక్టోబర్ లో వేయు పప్పుశనగ పంటకు దోహదపడుతుంది.

**డా॥ బి. సహదేవ రెడ్డి**
ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి, మెట్ట వ్యవసాయం
వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురము.
చరవాణి : 99896 25222

**గమనిక : రైతు సేవలో టోల్ ఫ్రీ నెంబర్లు**

| | | |
|---|---|---|
| ఫార్మర్స్ కాల్ సెంటర్ (ఆంగ్రూ) | : | 1800 425 0430 |
| ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ (డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రం) | : | 155251 |
| కిసాన్ కాల్ సెంటర్ | : | 1800 180 1551 |
| ఉద్యాన శాఖ | : | 1800 425 2960 |
| శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం | : | 1800 120 4209 |
| కిసాన్ సారథి | : | 1800 123 2175 లేదా 14426 |
| మత్స్య శాఖ | : | 1800 425 1188 |
| వాతావరణ సూచనలు (భారత ప్రభుత్వం) | : | 1800 180 1717 |

**రైతు సేవలో వివిధ ఆధునిక యాప్‌లు**

**అంగ్రూ అగ్రి, కృషి విజ్ఞాన్, ఆంగ్రూ చెరకు సాగు, వ్యవసాయ వాతావరణ సూచనలు, పశుపోషణ్, ఫర్టిలైజర్ కాలిక్యులేటర్, ఆర్.బి.కె. ఛానల్**

ఈ యాప్‌లు వినియోగించుటకు స్మార్ట్ ఫోన్ కలిగిన వారు గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చు

# వరి నారుమడిలో ఆశించు పురుగులు మరియు వాటి యాజమాన్యము

డా॥ వై. సృజన, సహ ఆచార్యులు (కీటక శాస్త్రం); డా॥ డి. అనిల్ కుమార్, సహ ఆచార్యులు (కీటక శాస్త్రం);
డా॥ ఎన్. శ్రీ సంధ్య, సహ ఆచార్యులు (కీటక శాస్త్రం) మరియు డా॥ ఎస్. దురువ, ఆచార్యులు (కీటక శాస్త్రం);
వ్యవసాయ కళాశాల, నైరా, శ్రీకాకుళం.

వరి పంటలో నారు పోసిన సమయము నుండి 30 రోజుల వరకు, వివిధ చీడ పీడలు ఆశించి నారుమడిలో ఉన్న పిలకలను గాయపరచి, వాటి పెరగుదలను దెబ్బతీస్తాయి. అందులో ముఖ్యంగా కాండము తొలుచు పురుగు, ఉల్లికోడు, తాటాకు పురుగు మరియు తామర పురుగులను గమనించవచ్చు.

**కాండం తొలుచు పురుగు :**

ఈ పురుగు నారుమడిలో ఆకు చివరి భాగములో గ్రుడ్లు పెడుతుంది. గ్రుడ్ల సముదాయమును పెట్టి వాటిపై, గోధుమ రంగు వెంట్రుకలతో కప్పుతుంది. తల్లి రెక్కల పురుగు పసుపు రంగులో ఉండి, ముందు రెక్కల పైన నల్లటి మచ్చలు కలిగి



కాండం తొలుచు తల్లి రెక్కల పురుగు



కాండం తొలుచు పురుగు గుడ్లు

ఉంటాయి. ముఖ్యంగా పొలంలో నాటిన తరువాత, ఆ గుడ్ల నుండి వచ్చిన గొంగళి పురుగులు వరి పిలకను ఆశించి చనిపోయేలా చేస్తాయి. చేను బిర్రు పొట్ట దశలోనూ మరియు ఈనిక తరువాత కనుక పురుగు ఆశించినచో, గింజలకు పోషక పదార్థములు అందక, అన్నీ తాలు గింజలుగా మారి వెన్ను తెల్లగా ఎండి పోతుంది. తెల్ల కంకిని కనుక లాగినట్లైతే తేలికగా ఊడి వస్తుంది.

**తీసుకోవలసిన సమగ్ర సస్య రక్షణ చర్యలు :**

- వేసవిలో లోతు దుక్కులు చేయాలి.
- నారుమడిలో ఒక చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా ఒక గ్రుడ్ల సముదాయము ఉన్నచో, సస్య రక్షణ చర్యలు చేపట్టవలెను.
- నాటే సమయములో నారుకట్టల ఆకు చివరలను త్రుంచి వేయవలెను.
- వరి నాటిన 35 రోజుల తర్వాత నుండి ఒక ఎకరాకు 20,000 చొప్పున 15 రోజుల వ్యవధిలో 3 సార్లు ట్రైకోగ్రామా మిత్ర పురుగులను విడుదల చేయాలి.
- ఎకరానికి 8 చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టి, పురుగును కొంతవరకు నివారించవచ్చు.
- అదే పిలక దశలో కనుక 5% మొవ్వలు చనిపోయిన లేదా ఒక చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా ఒక గ్రుడ్ల సముదాయము ఉన్నచో చర్యలు తీసుకోవలెను.
- పిలకలు తొడిగే దశలో క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి. 2.5 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి. 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. చిరు పొట్ట దశలో క్లోరాంట్రినిలి ప్రోల్ 20 యస్.సి. 0.3 మి.లీ. లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 యస్.పి. 2.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



ఉల్లి కోడు ఆశించిన నారు

**ఉల్లికోడు :**

ఈ పురుగు యొక్క ఉధృతి ఎక్కువగా నారుమడి దశ నుండి పిలక దశ వరకు గమనించవచ్చు. తల్లి పురుగులు దోమ ఆకారంలో ముదురు ఎరుపు రంగులో ఉంటాయి. ఈ పురుగు ఆశించిన పిలకలలో అంకురము ఉల్లి గొట్టాలులాగా మారి, కంకి వెయ్యకపోగ దిగుబడులు తగ్గిపోతాయి. పిలకలు ఏర్పడే దశలో ఈ పురుగు సోకిన పంటకు నష్టము ఎక్కువగా సంభ విస్తుంది.

**సస్యరక్షణ చర్యలు :**

- సాధ్యమైనంత త్వరగా నాట్లు వేయాలి. ఆలస్యమైతే ఉల్లి కోడు ఆశిస్తుంది.
- నారుమడిలో ఒక చదరపు మీటరుకు ఒక ఉల్లి కోడు సోకిన పిలక ఉన్నచో, సస్య రక్షణ చర్యలు చేపట్టవలెను.
- నారు తీయుటకు వారం రోజుల ముందు, ఒక సెంటు నారుమడిలో 160 గ్రా. కార్బోఫ్యూరాన్ 3 జి. గుళికలు వేసుకోవాలి.
- పొలంలో 5% ఉల్లి గొట్టాలు ఉన్న లేదా ఒక దుబ్బుకు ఒక ఉల్లి కోడు ఉన్న పిలక కనిపించిన వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.
- నాట్లు వేసిన10-15 రోజుల తరువాత, ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3 జి. గుళికలు లేదా ఫోరేట్ 10 జి. గుళికలు 5 కిలోల చొప్పున వేసుకోవాలి. తరువాత 15 రోజులకు క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి. 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



తాటాకు తెగులు

**తాటాకు తెగులు :**

తల్లి పెంకు పురుగు వీపుపై చిన్న ముళ్ళు కలిగి ఉండి, 4-5 మి.మీ. పొడవు ఉంటుంది. ఇది నీలముతో కూడిన నలుపు రంగులో ఉండును. ఆకు చివరి భాగమున కానీ వెనుక భాగమున కానీ 30-100 వరకు గ్రుడ్లను పెడుతుంది.

పిల్ల పురుగులు ఆకు పొరల మధ్యన చొచ్చుకుపోయి పచ్చని పదార్థాన్ని గోకి తింటాయి. తల్లి పురుగులు కూడా ఆకు పై పత్ర హరితాన్ని చారలు చారలుగా గోకి తింటాయి. ఆకు పై తెల్లటి చారలు కలిగి ఉండి, పత్ర హరితాన్ని కోల్పోవటం వలన ఆకులు ఎండిపోతాయి.

**సస్యరక్షణ చర్యలు :**

- నాటునపుడు నారుకట్టల చివరలను త్రుంచి నాటాలి.
- పొలములో దుబ్బుకు 2 పెంకు పురుగులు ఆశించిన ఆకులు కనిపించినచో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.
- ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి. 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 20 ఇ.సి. 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు :**

ఈ పురుగు యొక్క తల్లి మరియు పిల్ల పురుగులు నారుమడిలో ఆకు చివరన గుంపులుగా చేరి, ఆకులను గోకి రసాన్ని పీల్చి నష్టం కలుగ చేస్తాయి. అందువలన నారుమడిలో లేదా ముఖ్యంగా పొలములో ఈ పురుగు సోకినట్లయితే, ఆకు చివరలు మాడి సూదిగ తయారవుతాయి.

**సస్య రక్షణ చర్యలు :** ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 94544 47523

# ఎడగారు వరిలో నల్లి యాజమాన్యం

డా॥ ఐ. పరమశివ, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ సి.హెచ్. శ్రీలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం) మరియు డా॥ యు. వినీత, సీనియర్ శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం), వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరు.

వేసవిలో సాగు చేయబడుతున్న ఎడగారు వరి పైరును ఆకునల్లి మరియు కంకినల్లి అను రెండు రకాల నల్లి జాతి పురుగులు ఆశించి నష్టపరుస్తున్నాయి. ఈ రెండు నల్లి పురుగులు అతి సూక్ష్మంగా ఉండి కంటికి కనిపించవు, కాబట్టి వాటి నష్ట లక్షణాల ఆధారంగా పురుగు ఉధృతిని గుర్తించి వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వేసవిలో ఉన్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా నల్లి తాకిడి ఎక్కువయ్యే అవకాశాలు ఉన్నాయి. సిఫార్సుకు మించి నత్రజని ఎరువులు వాడకం కూడా నల్లి ఉధృతికి కారణమవుతున్నాయి.

**ఆకు నల్లి :** ఆకునల్లి కంటికి కనబడని సూక్ష్మ సాలీడు వర్గానికి చెందిన పురుగులు. ఇవి రెక్కలు లేకుండా 1 మి.మీ. పొడవు కలిగి బూడిద రంగులో ఉంటాయి. వరి నాటిన 20-80 రోజుల్లో ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అనుకూలం. పొలం గట్లపై ఉండే కలుపు మొక్కలైన గరిక, ఊదర ద్వారా వరి పైరుకు వ్యాప్తి చెందుతుంది. ఈ పురుగులు ఆకుల అడుగు భాగాన ఈనెల వెంబడి గుంపులు, గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయి. తద్వారా తొలుత ఆకులపై చిన్న చిన్న తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. ఉధృతి పెరిగే కొద్ది తెల్లని లేదా పసుపు రంగు చారలు ఏర్పడతాయి. వరి పిలకలు వేయు దశలో, అంకురం ఏర్పడే దశలో నల్లి ఆశించినట్లయితే అధిక నష్టం కలుగుతుంది. మొక్కలు గిడసబారి ఆకులు కషాయం రంగులోకి మారుతాయి. వర్షాభావ పరిస్థితుల్లో ఈ పురుగు తాకిడి ఎక్కువగా ఉంటుంది. కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం కలగడం వలన మొక్కలు క్రమేపి గిడసబారి ఎండిపోతాయి.



ఆకు నల్లి




ఆకులపై తెల్లటి మచ్చలు




ఆకులపై పసుపు రంగు చారలు

**కంకి నల్లి :** కంకి నల్లి అతి సూక్ష్మమైనది. అందువల్ల రైతు స్థాయిలో గమనించడం కష్టం, నష్ట లక్షణాలను గుర్తించి వెంటనే నివారణ చర్యలను చేపట్టాలి. కంకి నల్లి తెలుపు రంగులో ఉండి, జీవితకాలాన్ని 6 నుండి 10 రోజుల్లో పూర్తి చేసుకుంటాయి. ఒక్కో ఆడ నల్లి 60-65 గుడ్లు పెడుతుంది. ఈ పురుగులు ఆకు తొడిమ పై భాగంలో ఉండే కణజాలంలోనూ,




ఆకు క్రింద ఉదా రంగు మచ్చలు



ఆకు తొడిమలపై ఉదా రంగు మచ్చలు



కంకిలో తాలు గింజలు

మధ్య ఈనె కింది భాగంలోని కణజాలాల్లోను గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయి. తద్వారా ఆకు తొడిమ మీద మరియు మధ్య ఈనెకు ఇరువైపుల ఊదా రంగు మచ్చలు ఏర్పడతాయి. ఊదా రంగు మచ్చలను పురుగుల సంఖ్య పెరుగుదలకు లక్షణాలుగా గుర్తించాలి. కంకి నల్లి పురుగులు ఆకులపై చేరి రసాన్ని పీల్చడం వలన పసుపు రంగు చారలు ఏర్పడి ఆకులు వంకర్లు తిరుగుతాయి. వెన్ను అభివృద్ధి చెందే దశలో వెన్నులోని గింజలను ఆశించి అండాశయాన్ని, పుప్పొడిని నష్టపరచడం వలన తాలు గింజలు ఏర్పడుతాయి. పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వెన్ను సరిగా బయటకు రాదు. చిరుపొట్ట దశ నుండి గింజలు పాలు పోసుకునే దశ వరకు ఈ పురుగు ఆశించినట్లయితే కలిగే నష్టం అధికంగా ఉంటుంది. కంకినల్లి పొట్టకుళ్ళును కలుగజేసే శిలీంధ్రాన్ని వ్యాప్తి చేస్తాయి.

**నివారణ :**

- పొలంలోను మరియు గట్లపైన కలుపు మొక్కలు ముఖ్యంగా గరిక, ఊదర వంటివి ఆకునల్లి మరియు కంకినల్లి వ్యాప్తికి దోహద పడతాయి. కావున గట్లను కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఆకు నల్లి నివారణకు లక్షణాలను గమనించిన వెంటనే ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి. 2 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 240 యస్.సి. 1 మి.లీ. లను లీటరు నీటికి కలిపి పైరంతా బాగా తడిచేలా 7 నుండి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.
- కంకి నల్లి నివారణకు ఆకు తొడిమలపైన లేదా మధ్య ఈనెకు ఇరువైపుల ఊదా రంగు మచ్చలను గమనించిన వెంటనే స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లేదా ప్రొపర్‌జైట్ 57 ఇ.సి. ను 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి ఆకులు పూర్తిగా తడిచేలా వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 98496 12545

ఆకు పచ్చ హరితవనం - అది చేస్తుంది మన భూమిని స్వర్గం
సమగ్ర సస్యరక్షణ చేపట్టు - అధిక దిగుబడులు రాబట్టు

# ప్రత్తిలో సమగ్ర కలుపు యాజమాన్యం

డా॥ ఎన్. వెంకట లక్ష్మీ, సీనియర్ శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); డా॥ బి. శ్రీలక్ష్మీ, ప్రధాన శాస్త్రవేత్త (తెగుళ్ళ శాస్త్రం); డా॥ జి.ఎ. దయనా గ్రేస్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) మరియు డా॥ యం. సుధారాణి, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి); ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, గుంటూరు.

తెలుగు రాష్ట్రాలలో ప్రత్తి ప్రధాన వాణిజ్య పంటగా అన్ని ప్రాంతాలలోను, ఎక్కువగా నల్ల రేగడి భూములలో వర్షాధారపు పంటగా సాగు చేస్తున్నారు. ప్రత్తి పంట 150 నుండి 180 రోజుల వరకు కాల పరిమితి కలిగినది. సహజంగా ఈ పంట కోస్తా ప్రాంతం ఎర్ర నేలల్లో జూన్ మధ్యలో, కోస్తా ప్రాంతం నల్ల నేలల్లో జూలై – ఆగష్టు మాసాలలో విత్తేందుకు అనుకూలమైనది.

ప్రత్తి పంటలో వరుసల (సాళ్ళ) మధ్య దూరం ఎక్కువగా ఉండటం, అవసరానికి మించి ఎరువులు వాడటం, వర్షాకాలంలో భూమిలో తేమ ఎక్కువగా ఉండటం మొదలగు కారణాల వలన కలుపు బాగా పెరిగి పోషక పదార్థాలు, తేమ, సూర్యరశ్మి మొదలగు వాటికై పైరుతో పోటీపడి, ప్రత్తి పెరుగుదల, దిగుబడిని 50 నుండి 85 శాతం వరకు తగ్గిస్తాయి.

అంతేకాక కొన్ని రకాల కలుపు మొక్కలు ప్రత్యేకించి తుత్తురు బెండ మొదలగు కలుపు మొక్క నాంజేదు తెగులు (పిండినల్లి) వ్యాప్తి చేసే పురుగులకు, అలాగే వయ్యారి భామ తెగుళ్ళ కారకాలకు ఆశ్రయమిచ్చి వాటి వ్యాప్తికి దోహదపడతాయి. తద్వారా రైతుకు సస్యరక్షణపై ఖర్చు పెరుగుతుంది.

- ప్రత్తిలో కలుపు నిర్మూలనకు మొదటి 50–60 రోజులు కీలకమైన సమయం. కనుక రైతులు ఈ క్రింది సూచించిన పద్ధతులు అనుసరించి అధిక దిగుబడులు పొందవచ్చు. పైరు మొక్క తొలిదశలో అనగా 50 నుండి 60 రోజుల సమయంలో కలుపు సమస్యకు గురి కాకుండా తగు యాజమాన్య పద్ధతులు పాటించాలి. ఈ దశలో కలుపు సమస్యను అరికట్టకపోతే దాని వలన వచ్చే ఆర్థిక నష్టాన్ని, తదుపరి పంట కాలంలో ఏ విధంగాను పూరించలేము.
- వాడవలసిన కలుపు మందులను దృష్టిలో పెట్టుకొని ప్రత్తి పైరులో వచ్చే కలుపు మొక్కలు 3 రకాలుగా విభజించవచ్చు.

**గడ్డిజాతి మొక్కలు :** చిప్పెర గడ్డి, దోమ కాలు గడ్డి, నక్షత్ర గడ్డి, కావలి గడ్డి, ఊద, ఉర్రంకి మొదలగునవి.



నక్షత్ర గడ్డి



కావలి గడ్డి

**తుంగ జాతి మొక్కలు :** తుంగ, శాఖ తుంగ, రాకాసి తుంగ మొదలగునవి.

**వెడల్పాకు జాతి మొక్కలు :** చెంచల కాడ, తుత్తుర బెండ, గలిజేరు



తుంగ



రాకాసి తుంగ

కాడ, గడ్డి చామంతి, నేల ఉసిరి, ఏలిక జెముడు, మురిపిండాకు, పిచ్చి జనుము, కుక్క మిరప, గాడిద గరప, కుక్క తులసి మొదలగునవి.

- ప్రత్తి పొలంలో ఏ రకం కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నాయో తెలుసుకుంటే వాటి నిర్మూలనకు ఏ రకం కలుపు మందులు, ఏవిధంగా వాడాలో నిర్ణయించుకోవటంలో చాలా ఉపయోగపడుతుంది.

**కలుపు యాజమాన్యం :**

ప్రత్తి పైరు దీర్ఘకాలిక పంట కనుక ఏ ఒక్క పద్ధతి ద్వారా పూర్తిగా కలుపు నిర్మూలన చేయడం కష్టం. కనుక భౌతిక, రసాయన, సేద్య పద్ధతులను ఉపయోగించి వివిధ దశలలో కలుపు నిర్మూలన చేయాలి.

1. భౌతిక పద్ధతులు
2. సేద్య పద్ధతులు
3. రసాయనాలతో కలుపు నివారణ

**1. భౌతిక పద్ధతులు :**

- భౌతిక పద్ధతులలో ముఖ్యమైనవి కూలీలతో 15-20 రోజుల వ్యవధిలో విత్తిన 20, 40, 60 రోజులప్పుడు కలుపు తీయుట. అయితే ప్రస్తుత పరిస్థితులలో కూలీల రేట్లు ఎక్కువగా ఉండుట, కూలీల కొరత వలన ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పద్ధతి.
- అంతరకృషి చేసిన తర్వాత మొక్క మొదళ్ళలో ఏదైనా కొద్దిపాటి కలుపు మొక్కలు ఉన్నప్పుడు ఈ పద్ధతిని ఆచరించవచ్చు.


**2. సేద్య పద్ధతులు :**

సేద్య పద్ధతులు ఆచరించి కలుపును తక్కువ ఖర్చుతో నిర్మూలించవచ్చు.


- వేసవిలో లోతు దుక్కులు చేయుట.



గలిజేరు కాడ



గడ్డి చామంతి




ఏలిక జెముడు



కుక్క తులసి

- విత్తుటకు ముందు భూమిని చక్కగా దున్ని కలుపు లేకుండా చేయటం.
- ప్రతి విత్తిన 20, 40, 60 రోజులప్పుడు గొర్రు, గుంటకలతో నిలువుగా, అడ్డంగా అంతరకృషి చేయటం.
- అంతరకృషి చేయుట వలన కలుపు నిర్మూలన జరుగుటమే కాక పైరుకు గాలి తగిలి బాగా పెరుగుతుంది.
- వరుసల మధ్య ఎడం ఎక్కువగా ఉండుటచే మినుము, పెసర, సోయాచిక్కుడు వంటి వాటిని అంతర పంటలుగా వేయుట ద్వారా కూడ కలుపు ఉధృతిని తగ్గించటమే కాక రైతుకు అదనపు ఆదాయం మిగులుతుంది.

### 3. రసాయనాలతో కలుపు నివారణ :

- ప్రత్తి పైరులో విత్తిన వెంటనే మరియు ప్రత్తి మొలిచిన తర్వాత కలుపు మందులు వాడి కలుపును సమర్ధ వంతంగాను, చౌకగాను నిర్మూలించవచ్చు.
- అయితే కలుపు మందులు వాడేటప్పుడు సిఫార్సు చేసిన మోతాదులోనే, సమయములోనే సూచించిన విధముగా వాడాలి. లేనిచో కలుపు నిర్మూలన జరగక పోగా, కొన్ని సందర్భాలలో పంటకు కూడా నష్టం వాటిల్లవచ్చు.
- కనుక కలుపు మందులను నిపుణుల సలహా మేరకు లేదా సమీపంలోని వ్యవసాయ అధికారిని గాని సంప్రదించిన మీదటే వాడుట మంచిది.

#### ప్రత్తి విత్తిన వెంటనే :

- విత్తిన వెంటనే లేదా 1, 2 రోజుల్లో పెండిమిథాలిన్ 30 శాతం ద్రావకం (స్టాంప్) ఎకరాకు 1 నుంచి 1.3 లీ. లేదా అలాక్లోర్ 50 శాతం ద్రావకం (లాసో) 1.5 నుండి 2 లీ. చొప్పున ఏదో ఒక దానిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

#### ప్రత్తి మొలిచిన తర్వాత :

- ప్రత్తి మొలిచిన 20-25 రోజులప్పుడు ఖరీఫ్‌లో ఎక్కువ వర్షాలు పడి గొర్రు, గుంటకలతో అంతరకృషి కుదరనప్పుడు కలుపు విపరీతంగా పెరుగుతుంది.
- అటువంటి పరిస్థితులలో కేవలం గడ్డి జాతి మొక్కలు ఎక్కువగా ఉంటే ఎకరాకు 400 మి.లీ. క్విజలోఫాప్ ఇథైల్ 5% ద్రావకం 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి (అనగా లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున), కేవలం వెడల్పాకు కలుపు మొక్కలు మాత్రమే ఉన్నప్పుడు ఎకరాకు 250 మి.లీ. పైరిథయోబాక్ సోడియం 6% ద్రావకం 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి (అనగా 1 లీటరు నీటికి 1.25 మి.లీ. చొప్పున).
- ఈ మందును ప్రాధమిక దశలో అంటే 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు పిచికారి చేస్తే ప్రత్తికి ఎటువంటి ఇబ్బంది లేకుండా కలుపును సమర్ధవంతంగా నిర్మూలించవచ్చు. అవసరం అయితే మరలా 20 రోజుల వ్యవధిలో మరియొక సారి పిచికారి చేసుకోవచ్చు.
- క్విజలోఫాప్ ఇథైల్‌కు బదులుగా 250 మి.లీ. ప్రొపాక్విజోఫాప్ (ఎజిల్) 10% ద్రావకమును విడిగా కాని, అవసరాన్ని బట్టి పైరిథయోబాక్ సోడియం (హిట్‌వీడ్) తో కాని కలిపి వాడుకోవాలి.

#### అంతరకృషి చేయుటకు అవకాశంలేనప్పుడు :

- ఖరీఫ్‌లో వర్షాలు ఎక్కువగా ఉండి, అంతరకృషి కుదరనప్పుడు 1 ఎకరాకు 1 లీ. పారాక్వాట్ 24% మందును 200 లీ. నీటిలో కలిపి ప్రత్తి పంటపై పడకుండా స్ప్రేయర్ నాజిల్‌కు హుడ్ అమర్చుకొని వరుసల మధ్య, గట్లపై పిచికారి చేసుకొని కలుపును నివారించుకోవచ్చు.



స్ప్రేయర్ నాజిల్‌కు హుడ్ అమర్చుకొని పిచికారి చేయుట

- కాబట్టి రైతు సోదరులు పైన వివరించిన వివిధ రకాల కలుపు యాజమాన్య పద్ధతులను పాటించి సకాలంలో కలుపు నిర్మూలన చేపట్టినట్లయితే ప్రత్తిలో అధిక దిగుబడులు పొందవచ్చును.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 95059 92381

# ప్రత్తిలో గులాబిరంగు పురుగు నివారణకు చేపట్టవలసిన ముందు జాగ్రత్త చర్యలు

డా॥ జి.ఎ. దయానాగ్రేస్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ బి. శ్రీలక్ష్మీ, ప్రధాన శాస్త్రవేత్త (తెగుళ్ళ శాస్త్రం);
డా॥ ఎన్. వెంకట లక్ష్మీ, సీనియర్ శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు డా॥ యం. సుధారాణి, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి);
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం.

**తె**ల్ల బంగారం అని పిలవబడే ప్రత్తిని భారతదేశంలో ప్రముఖ వాణిజ్య పంటగా 11 రాష్ట్రాలలో ప్రధానంగా సాగు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్తిని సుమారుగా 6 లక్షల హెక్టారులలో సాగు చేస్తున్నారు. గత 5-6 సంవత్సరాలుగా ప్రత్తిలో గులాబిరంగు పురుగు దిగుబడి మరియు నాణ్యత పరంగా తీవ్రంగా నష్టం కలుగజేస్తున్నది. ఈ పురుగు ఉధృతి పెరగడానికి ప్రధాన కారణాలు, బి.టి. ప్రత్తిలోని విష పదార్ధానికి గులాబి రంగు పురుగు నిరోధక శక్తిని పెంపొందించుకోవడం, పంట మార్పిడి చేయకుండా సంవత్సరాల తరబడి ప్రత్తిని సాగు చేయటం బి.టి. ప్రత్తి చుట్టూ నాన్-బిటి ప్రత్తిని రిఫ్యూజిగా వేయకపోవటం, ఈ పురుగు ప్రత్తి పంటను మాత్రమే ఆహారంగా తినటం మొదలైనవి ముఖ్యంగా చెప్పుకోవచ్చు. ప్రత్తిని ఆశించే వివిధ కాయ తొలిచే పురుగుల వలే గులాబిరంగు పురుగు బయటకు కనిపించే పురుగు కాదు. ఇది కాయ లోపలే ఉంటూ కంటికి కనిపించకుండా తీవ్ర నష్టం కలుగచేస్తుంది. కాబట్టి రైతులు ఎంతో అప్రమత్తతో మెలిగి, గులాబి రంగు పురుగు సమగ్ర యాజమాన్యం చర్యలను ముందుగా చేపట్టాలి.

- గత సంవత్సరం ప్రపంచ విపణిలో గిరాకీ వలన ప్రత్తికి మార్కెట్‌లో మంచి ధర రావడం దృష్ట్యా ఈ సంవత్సరం ప్రత్తి సాగు సుమారుగా 25-30 శాతం పెరగటానికి అవకాశం ఉన్నట్లు అంచనాలు తెలియ జేస్తున్నాయి. కాబట్టి రైతాంగం కేవలం రసాయనానిక నివారణపై ఆధార పడకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మాత్రమే గులాబిరంగు పురుగును అదుపులో ఉంచగలం.
- ప్రత్తి మోడులను పొలం గట్ల మీద మరియు ఇంటి వద్ద కాని వంట చెఱకుగా వాడేందుకు నిల్వ చేయకూడదు. దీని వలన గొంగళి పురుగు నిద్రావస్థలో కొనసాగే ప్రమాదముంది, అనుకూల పరిస్థితులు వచ్చినప్పుడు గొంగళి పురుగు నిద్రావస్థ నుండి బయటకు వచ్చి, ప్రత్తి పంటను ముందుగానే ఆశించి తీవ్ర నష్టం కలుగజేసే అవకాశం ఉంటుంది.



గులాబి రంగు పురుగు



లింగాకర్షణ బుట్ట


- పంట మార్పిడి పద్ధతిని తప్పకుండా 2-3 సంవత్సరాలకు ఒకసారి విధిగా పాటించాలి. ఈ పురుగు ప్రత్తి మరియు ప్రత్తి జాతికి సంబంధించిన మొక్కలను మాత్రమే ఆహారంగా

తీసుకుంటుంది. కాబట్టి పంట మార్పిడి చేసినప్పుడు ఆహారం లేక చనిపోతుంది. నీటి వసతి ఉన్న ప్రాంతాలలో మొక్కజొన్నను సాగు చేయవచ్చు. అలాగే అపరాలను సాగు చేసుకోవాలి. ప్రతి పంట పరిసరాలలో బెండ పంట లేకుండా చూసుకోవాలి.

- విత్తన ఎంపిక అనేది కూడా చాలా ముఖ్యమైనది. తక్కువ కాల పరిమితి గల హైబ్రిడ్ రకాలను వేసుకోవడం ద్వారా గులాబి రంగు పురుగు ఉధృతిని తగ్గించుకొనవచ్చును.
- ఒకే ప్రాంతంలోని రైతులందరూ 7-10 రోజుల వ్యవధిలో పంటను విత్తుకొనిన యెడల గులాబిరంగు పురుగు ఉధృతి తగ్గుతుంది.
- పొలంలోను మరియు గట్ల మీద కలుపు లేకుండా చూసుకోవాలి.
- నత్రజని ఎరువులను అధికంగా వాడి పంట రొట్ట చేసుకొనకూడదు.
- పంట విత్తిన 45 రోజులకు గులాబిరంగు పురుగుకు ఎకరానికి 4-6 చొప్పున లింగాకర్షక బుట్టలను పెట్టుకొని, పురుగు యొక్క ఉనికిని గమనించుకోవాలి.
- సామూహికంగా రెక్కల పురుగులను పట్టుకోవడానికి ఎకరానికి 10-15 లింగాకర్షక బుట్టలు పంటకు ఒక అడుగు ఎత్తులో పెట్టుకోవాలి.
- గ్రుడ్డి పువ్వులను గమనించినట్లయితే ఏరి నాశనము చేయాలి.

గ్రుడ్డి పువ్వు





ఆరోగ్యకరమైన పువ్వు గ్రుడ్డి పువ్వు

- 15-20 రోజుల కొకసారి బుట్టలోని ఎరను మార్చుకోవాలి. లేనిచో లింగాకర్షక బుట్టలు పని చేయవు. ఇది రైతాంగం తప్పనిసరిగా గమనించాలి.
- ట్రైకోగ్రామా బాక్టి పరాన్న జీవులను ఒక ఎకరానికి 60,000 చొప్పున మూడు విడతలుగా, వారం రోజుల వ్యవధిలో పూత పూర్తి స్థాయిలో ఉన్నప్పుడు విడుదల చేయడం వలన గుడ్ల దశలో ఉన్న పురుగును నివారించవచ్చు.



ట్రైకో కార్డు

- మూడు రోజులు వరుసగా రోజుకు 8 రెక్కల పురుగులు బుట్టలో పడిన యెడల, ఆర్థిక సహన పరిమితి స్థాయిగా గుర్తించి, గుడ్డు మీద పని చేసే 5% వేపగింజల కషాయం లేదా వేప నూనె 3000 పి.పి.యం. 600 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి. 400 మి.లీ. లేదా థయోడికార్బ్ 75 డబ్ల్యు.పి. 300 గ్రా. మందులను ఎకరానికి పిచికారి చేసుకోవాలి.
- ఈ విధంగా రైతులందరూ సామూహికంగా ముందు జాగ్రత్త చర్యలను చేపట్టిన యెడల గులాబి రంగు పురుగు ఉధృతిని తగ్గించుకొని, నాణ్యమైన ప్రత్తిని తీసుకోవచ్చును.

**గమనిక :** సామూహికంగా రైతాంగం అంతా కలిసి పంట 40-45 రోజుల దశలో తప్పనిసరిగా గులాబి రంగు రెక్కల పురుగులను ఆకర్షించటానికి లింగాకర్షక బుట్టలు అప్రమత్తతో ముందస్తుగా సమకూర్చుకోవాలి. ఆలస్యంగా అనగా సెప్టెంబరు, అక్టోబరు మాసాలలో ఏర్పాటు చేసుకోవటం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 73824 17547

# మిరప నారుమళ్ళ యాజమాన్యంలో పాటించవలసిన మెళకువలు

డా॥ వై. మౌనిక, శాస్త్రవేత్త (ఉద్యాన శాస్త్రం), కృషి విజ్ఞాన కేంద్రం.; డా॥ జి. ప్రసాద్ బాబు, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం), ఏరువాక కేంద్రం; డా॥ ఎన్. రమేష్ నాయక్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ కె. లక్ష్మణ్, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు డా॥ టి. శ్రీనివాస్, కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి.

నారు మళ్ల పెంపకంలో కొన్ని మెళుకువలు పాటించనట్లయితే మంచి దిగుబడులు, నికర ఆధాయం పొందవచ్చు.

**మిరప రకాలు :** అర్కా క్యాతి, అర్కా శ్వేత, అర్కా అభిర్, అర్కా సుఫల్, అర్కా మేఘన, ఎల్.సి.హెచ్. -680, 625 అనే రకాలు సాగు చేసుకోవచ్చు.

**నారు పోసే సమయం :** ఖరీఫ్ కాలంలో మిరప సాగు కోసం జూలై నెలలో, లేట్ ఖరీఫ్ కాలంలో మిరప సాగుకోసం ఆగష్టు-సెప్టెంబర్ నెలలలో విత్తనాలు చల్లాలి. రబీ కాలంలో అయితే అక్టోబర్-నవంబర్ మాసము మధ్య వరకు నారు పోసుకోవచ్చు.

**నారు మడికి ఎంపిక చేసే స్థలం :** నీటి వసతికి దగ్గరగాఉండి, బాగా దున్నిన, మంచి సత్తువ కలిగి, నీరు నిలవని ప్రదేశాలను ఎంచుకోవాలి. ఉష్ణోగ్రత 20-28$^0$ సెంటీ గ్రేడ్ ఉన్నప్పుడు నారు బాగా మొలకెత్తుతుంది.

**నారు మళ్ళు తయారీ :** నేలను బాగా దున్ని, ఒక మీటరు వెడల్పు, 15 సెంటీ మీటర్ల ఎత్తు, 3 మీటర్ల పొడవు గల ఎత్తైన నారు మళ్లను తయారు చేసుకోవాలి. తరువాత మడి పైన ఒక అంగులం మందాన బాగా చివికిన పశువుల ఎరువును చల్లి బాగా కలపాలి. నారు పోయుటకు ముందు ఆ ప్రదేశాన్ని పూర్తిగా ఎండలో ఆరనివ్వాలి. ఈ విధముగా చేయడం వలన నేలలో ఉన్న శిలింద్రాలు చనిపోతాయి. ప్రతి చదరపు మీటరు నారు మడికి ఒక లీటరు నీటికి కాప్టాన్ /థైరామ్ 3-4 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేసి శుద్ధి చేయాలి. ఒక ఎకరానికి సరిపోయే నారుమడికి 1-2 కిలోల ట్రైకోడెర్మా విరిడి వేసి నారుకుళ్ళు తెగులును నివారించవచ్చును.

**విత్తన మోతాదు, విత్తన శుద్ధి మరియు విత్తుట :**

- నారు పెంచేందుకు సెంటుకు 650 గ్రాములు (ఒక ఎకరానికి సరిపడు నారు) విత్తనము మరియు ఎద పెట్టేందుకు ఎకరాకు 2.5 కిలోల విత్తనము సరిపోతుంది. సంకర రకాలైతే 80-100 గ్రాములు విత్తనము సరిపోతుంది.
- కిలో మిరప విత్తనానికి 8 గ్రాములు ఇమిడాక్లోప్రిడ్, 3 గ్రాములు మాంకోజెబ్ మందులను కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. అలాగే కిలో విత్తనానికి 5-10 గ్రాములు ట్రైకోడెర్మా విరిడి వంటి జీవ శిలింద్ర నాశిని మందుతో కూడా విత్తన శుద్ధి చేసుకోవచ్చు. దీనివల్ల మొలక శాతం ఎక్కువగా వస్తుంది. రసం పీల్చు పురుగులు, తెగుళ్ళ బారి నుంచి మొక్కలను కాపాడవచ్చు.
- 1 కిలో విత్తనాన్ని నారుమడిలో వరుసలలో 5 నుండి 10 సెం.మీ. దూరంలో, 1 నుండి 1.5 సెం.మీ. లోతులో పడే విధంగా పలుచగా విత్తుకోవాలి. ఎక్కువ లోతులో విత్తనాలను నాటకూడదు. దగ్గరగా నాటితే నారు సరిగ్గా మొలవక పోవడం, బలహీనంగా రావడం జరుగుతుంది.



**పోషకాల యాజమాన్యం :** ఆరోగ్యవంతమైన నారు కోసం విత్తే సమయంలో చదరపు మీటరుకు వానపాముల ఎరువు లేదా బాగా చివికిన పశువుల ఎరువు 1 కిలో, 25-30 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మరియు విత్తిన 15-20 రోజులకు చదరపు మీటరుకు 3 గ్రాములు యూరియాను వేయాలి.

**సస్య రక్షణ :**

- నారు కుళ్ళు తెగులు సోకకుండా 10-15 రోజులకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- నారు పెరుగుదల దశలో రసం పీల్చే పురుగు ఆశించకుండా కార్బొఫ్యూరాన్ 3 జి. గుళికలు నారు మడిలో చల్లి నీరు కట్టాలి.
- 5 నుండి 6 వారాలలో నారు ప్రధాన పొలములో నాటడానికి తయారువుతుంది. నారును నారు మడి నుండి తీసిన 24 గంటలలో ప్రధాన పొలంలో నాటాలి. ఆరోగ్యవంతమైన నారును సరైన సమయంలో నాటడం ద్వారా మిరప పంటలో మంచి దిగుబడిని సాధించవచ్చు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 96032 93514

# చెఱకు తోటలను నిలగట్టుట - జడచుట్లు

డా॥ టి. చిత్కళాదేవి, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, అనకాపల్లి.

**మ**న ఆంధ్రప్రదేశ్ చెఱకు పంట సుమారు 80 వేల హెక్టార్లలో సాగయ్యే ఒక ప్రధాన వాణిజ్య పంట. చెఱకు పంటను డిశంబరు నుంచి మార్చి, ఏప్రిల్ వరకు కూడ నాటుతారు. ఈ విధంగా నాటిన చెఱకు తోటలు జూలై, ఆగష్టు మాసాలకు పిలక దశ దాటి పెరుగుదల దశకు చేరుకుంటాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకు పడే అధిక వర్షపాతం, అధిక తేమ, అధిక ఉష్ణోగ్రత, సూర్యరశ్మిని వినియోగించుకుని అక్టోబరు వరకు చెఱకు తోటలు ఏపుగా పెరుగుతాయి. ఈ దశలో చెఱకు పిలకలు గడలుగా మారి కణుపుల మధ్య దూరం పెరుగుతుంది. అక్టోబరు నెలాఖరకు చెఱకు తోటలు సుమారు 3 మీటర్లు ఎత్తు వరకు పెరుగుతాయి. చెఱకు పెదకువ దశలో రోజుకు సుమారు 2.5 సెం.మీ. పొడవు పెరుగుతాయని అంచనా.



ఉత్తర కోస్తా ప్రాంతాలలో నైఋతీ ఋతు పవనాల కాలంలో వర్షంతో కూడిన ఈదురు గాలులు సర్వసాధారణం. అధిక వర్షాల వల్ల మొక్క మొదళ్ళలో మట్టి వదులుగా వుండి, వేర్లు బలహీనపడడం, చెఱకు గడల తల బరువు అధికంగా వుండడం వల్ల తుఫాను గాలుల తాకిడికి చెరకు తోటలు సులభంగా పడిపోతాయి. తోటలు పడిపోవడం వల్ల ఎన్నో నష్టాలు వాటిల్లు తాయి. వర్షాకాలంలో పడిపోయిన చెఱకు తోటల్లో పెరుగుదల ఆగిపోయి, తోటలు కొట్టే సమయానికి పొడవు తగ్గిపోతుంది. కొన్ని గడలు విరిగి పడిపోవడం వలన ఎలుకలు, ఉడుతలు, నక్కలు, గడలను కొట్టివేయడం వల్ల చెఱకు దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి.

పడిపోయిన తోటల్లో చెరకు కణుపుల వద్ద వేర్లు ఏర్పడడం వలన గడలో నార శాతం పెరిగి బరువు తగ్గుతుంది. దీని కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గి రసనాణ్యత పడిపోతుంది. పడిపోయిన చెఱకులో రస నాణ్యత లోపించడం వల్ల పంచదార దిగుబడి తగ్గుతుంది. నిలబడిన చెఱకు కన్న పడిపోయిన చెఱకులో సుమారు 4 శాతం వరకూ చక్కెర తగ్గినట్లు పరిశోధనా ఫలితాలు తెలియజేస్తున్నాయి.

- పడిపోయిన తోటలను నరికి గానుగాడించినపుడు ఎక్కువ శాతం మొలాసెస్ లోకి పోయి పంచదార రికవరీ తగ్గుతుంది.
- తుఫానుల సమయంలో గాలుల తాకిడికి గడలపై పగుళ్ళు ఏర్పడతాయి. ఈ పగుళ్ళ ద్వారా శిలీంధ్ర బీజాలు వ్యాపించి గడలు కుళ్ళటం వలన చెఱకు, పంచదార దిగుబడులు బాగా తగ్గుతాయి.
- పడిపోయిన తోటలను నరకడానికి ఖర్చు ఎక్కువవుతుంది. చెఱకు గడలు వంపు తిరిగి ఉండడం వల్ల ఎక్కువ స్థలాన్ని ఆక్రమించి చెఱకు నరకు ఖర్చు మరియు రవాణా ఖర్చులు పెరుగుతాయి.
- పడిపోయిన తోటల్లో దుబ్బులు ఎక్కువగా చనిపోవడం వల్ల కార్శి తోటల్లో ఖాళీలు ఎక్కువగా ఏర్పడి కార్శి దిగుబడులు కూడా తగ్గిపోతాయి.
- పడిపోయిన తోటల చెఱకు నుంచి తయారు చేసిన బెల్లం నాణ్యత లోపించి ఎక్కువ రోజులు నిల్వ ఉండదు.

ఈ నష్టాలన్నీ అధిగమించాలంటే సరైన సమయంలో చెరకు తోటలను నిలగట్టడం చాలా అవసరం. చెరకు తోటలు పడిపోకుండా ధృడంగా నిలబడటానికి, భూమి తయారీ నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. లోతు దుక్కిచేయడం, లోతు కాలువల్లో ముచ్చెలు నాటడం. పంట 4 నెలల వయస్సులో ఉన్నప్పుడు మొక్క మొదళ్ళకు మట్టిని ఎగదోయడం వంటి యాజమాన్య పద్ధతులతో పాటు చెఱకు పెరిగే దశలో పంటల ఎదుగుదలను

బట్టి అక్టోబరు, నవంబరు లోపు 2,3 సార్లు జడ చుట్లు వేయాలి. జూన్, జూలైలో ఒకసారి ఆగష్టు, సెప్టెంబరులో రెండో సారి తప్పనిసరిగా జడ చుట్లు వెయ్యాలి. ఈ జడచుట్టు పద్ధతిలో రెండు వరుసల్లోని చెఱకులను దగ్గరకు చేర్చి పండు బారిన ఆకులను, ముదురు ఆకులను తాడుగా వేసి, 4 నుండి 6 గడలను జడలోకి చేర్చి మెలిక వేస్తూ జడ చుట్లు వేసి చెఱకు తోటలను నిలగట్టాలి. జడచుట్లు వేసేటప్పుడు మొవ్వులోని 8 పచ్చని ఆకులు వదిలి మిగిలిన ఆకులను మాత్రమే విరిచి జడచుట్లు వేయాలి. లేత ఆకులను జడలో వెయ్యకూడదు. అలా చేస్తే మొక్క పెరుగుదల ఆగిపోయి. గడలు సన్నబడి బరువు తగ్గుతాయి. తోట కొట్టే సమయానికి చచ్చు గడలు ఎక్కువగా తేలి దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. కాబట్టి అనుభవం కలిగిన పనివారితోనే జడ చుట్లు వేయించాలి. జడ చుట్టు వేసేటప్పుడు, భూమిలో తగినంత పదును ఉండాలి, లేనట్లయితే వరుసలోని గడలను దగ్గరకు చేర్చినపుడు చెరకు గడలు విరిగిపోయే అవకాశం ఉంది.

జడ చుట్లు పద్ధతిలోనే గాక, ప్రోపింగ్, స్టేకింగ్‌లలో కూడా తోటలను నిలగట్టవచ్చు. ఈ పద్ధతిలో మొదటి చుట్టులోనే ఏ దుబ్బు ఆకులను ఆ దుబ్బుకే చుట్టి, రెండవ చుట్టులో రెండు వరుసలలోని నాలుగు దుబ్బులను ఒక దుబ్బుతో వేరొక దుబ్బును కలిపి చుట్టాలి.

ఈ విధంగా జడ చుట్టు పద్ధతిలో తోటలను నిలగట్టడం వల్ల చెరకు దిగుబడులు పంచదార దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి. నాణ్యత గల బెల్లం లభిస్తుంది.

**మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : 99896 25216**

**దూరదర్శన్ – ముఖాముఖి కార్యక్రమాల వివరాలు (సా. 6.00 నుండి 6.55 గం॥ వరకు)**

| తేది | అంశం | నిపుణులు | ఫోన్ నెంబర్లు |
|---|---|---|---|
| 01.08.2022 (సోమ వారం) | పసుపు సమగ్ర యాజమాన్య పద్ధతులు | **డా॥ కె. గిరిధర్ కృష్ణ,** ప్రధాన శాస్త్రవేత్త (ఉద్యాన శాస్త్రం) ఉద్యాన పరిశోధనా స్థానం, లాం, గుంటూరు జిల్లా. | 98497 27719 |
| 04.08.2022 (గురు వారం) | కూరగాయలు – ఆరోగ్య కారకాలు – విలువ జోడింపు | **డా॥ ఇ. కరుణ శ్రీ,** ప్రధాన శాస్త్రవేత్త & అధిపతి, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకటరామన్నగూడెం. | 73826 33692 |
| 08.08.2022 (సోమ వారం) | కోళ్ళ పోషణలో తీసుకోవలసిన జాగ్రత్తలు | **డా॥ పి. రమేష్ బాబు,** సహ ఆచార్యులు, పశువైద్య కళాశాల, ప్రొద్దుటూరు, డా॥ వై.ఎస్.ఆర్. కడప జిల్లా. | 77022 71071 |
| 11.08.2022 (సోమ వారం) | చెఱకు సాగులో కీలక యాజమాన్య చర్యలు | డా॥ టి. చిత్కళదేవి, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, అనకాపల్లి విశాఖపట్నం జిల్లా. | 99896 25216 |
| 18.08.2022 (గురు వారం) | ఖరీఫ్ వేరుశనగలో మేలైన దిగుబడులకు మెళకువలు | **డా॥ కె.ఎస్.ఎస్. నాయక్,** ప్రధాన శాస్త్రవేత్త (వేరుశనగ) వ్యవసాయ పరిశోధనా స్థానం, కదిరి, అనంతపురం | 89197 55647<br>98851 92007 |
| 22.08.2022 (సోమ వారం) | మునగ సమగ్ర యాజమాన్యం | **డా॥ యం. ముత్యాల నాయుడు, ప్రధాన శాస్త్రవేత్త** & అధిపతి, ఉద్యాన పరిశోధనా స్థానం, దర్శి, ప్రకాశం జిల్లా. | 94907 02908 |
| 25.08.2022 (గురు వారం) | పశువులలో సంక్రమించే కంటి సంబంధిత వ్యాధులు–తీసుకోవలసిన జాగ్రత్తలు – నివారణ | **డా॥ కె. రాంబాబు,** సహాయ ఆచార్యులు, పశువైద్య కళాశాల, ప్రొద్దుటూరు, డా॥ వై.ఎస్.ఆర్. కడప జిల్లా | 98669 53132 |
| 29.08.2022 (సోమ వారం) | ఖరీఫ్ కాలానికి మెట్ట వ్యవసాయంలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలు | **డా॥ బి. సహదేవ రెడ్డి,** ప్రధాన శాస్త్రవేత్త (మెట్ట వ్యవసాయం), వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురం జిల్లా. | 99896 25222<br>90141 02158 |

# వర్షాకాలంలో పశువులలో వచ్చే వ్యాధులు మరియు వాటి నివారణ చర్యలు

డా॥ ఎన్. లీలాకృష్ణ, శాస్త్రవేత్త (పశువైద్య శాస్త్రం), కె.వి.కె., డా॥ యం. బసవయ్య, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (పశువైద్య శాస్త్రం), బొట్లపాలెం, దర్శి మరియు డా॥ ఎన్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్, కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి.

వర్షాకాలంలో ఉండే చిత్తడి నేలలు, చిరుజల్లులు, కలుషిత నీరు, ముసురుతున్న ఈగలు, మొలిచే పచ్చిక వలన పశువులలో అనేక రోగాలు కలుగుతాయి. పాడి పశువులలో జబ్బ వాపు, గొంతు వాపు మరియు గాలికుంటు వ్యాధులు; అదే సన్నజీవాలలో అయితే చిటుక రోగం, పారుడు రోగం, నీలి నాలుక మరియు కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెంది ఒక్కోసారి మరణాలకు దారితీస్తాయి. వ్యాధికి గురయితే చికిత్స కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టాలి, తీరా ఖర్చు చేసినా పశువులు చనిపోతే రైతులకు మరింత నష్టం కలుగుతుంది. అదే వంద రూపాయలలోపు ఖర్చుతో అంటువ్యాధులు రాకుండా టీకాలను వేయించి పాకలలో పరిశుభ్రతను పాటిస్తే నష్టాలను తగ్గించే అవకాశం ఉంటుంది. కావున మనం వర్షాకాలంలో పశువులలో వచ్చే వ్యాధులు వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలుసుకుందాం.

## పాడి పశువులలో వచ్చే వ్యాధులు :

### జబ్బ వాపు వ్యాధి :

ఈ వ్యాధిని క్లాస్ట్రీడియం చొవై అనే బాక్టీరియా 6 నెలలు నుంచి 3 సంవత్సరాల వయస్సు కలిగిన బలిష్టమైన పశువులలో ఎక్కువగా కలుగచేస్తుంది. ఈ వ్యాధి తెల్ల పశువులలో (ఆవులలో మరియు ఎద్దులలో) ఎక్కువగా కలుగుతుంది.

**వ్యాధి వ్యాప్తి :** కలుషితమైన నీరు, ఆహారం మరియు శరీరం పైన ఉన్న గాయాల ద్వారా ఈ బాక్టీరియా పశువు శరీరంలో చేరి వ్యాధిని కలుగచేస్తుంది.

**వ్యాధి లక్షణాలు :** వ్యాధి బారిన పడిన పశువులలో $104^0$ ఫారెన్ హీట్ జ్వరం ఉంటుంది. పశువుల భుజము, తొడ కండరాలలో వాపు ఉండి త్రాకినచో గరగరమనే శబ్దం వస్తుంది.

**వ్యాధి చికిత్స మరియు నివారణ చర్యలు :** వ్యాధి సోకిన పశువులలో పెన్సిలిన్ ఇంజెక్షన్లు, నొప్పిని మరియు జ్వరాన్ని తగ్గించే (యాంటి ఇన్ఫలమేటరీ) మందులు, నొప్పిని తగ్గించే (యాంటి అనాల్జేసిక్) ఇంజెక్షన్లు మరియు బి-కాంప్లెక్సు విటమిను ఇంజెక్షన్లను వ్యాధి చికిత్స కోసం పశువైద్యుని సలహాతో ఇవ్వాలి. వ్యాధి సోకిన పశువులను ఉంచిన పాకలలో 5% ఫెనాయిల్ లేదా 2% క్రెసోల్ వంటి క్రిమిసంహారక మందులతో శుభ్రం చేయాలి.

వ్యాధి రాకుండా అరికట్టడానికి వర్షాకాలానికి ముందు పశువులకు జబ్బవాపు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి.

### గొంతువాపు వ్యాధి / గురక వ్యాధి :

ఈ వ్యాధి ప్యాచురెల్ల మల్టీసీడ అనే బాక్టీరియా వలన కలుగుతుంది. ఈ వ్యాధి గేదెలలో ఎక్కువగా కనిపిస్తుంది.

**వ్యాధి వ్యాప్తి :** కలుషితమైన ఆహారం, నీరు మరియు గాలి ద్వారా పశువులకు ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది

**వ్యాధి లక్షణాలు :** వ్యాధి సోకిన 2-5 రోజులలోపు వ్యాధి



గొంతువాపు వ్యాధి / గురక వ్యాధి

లక్షణాలు బహిర్గతం అవుతాయి. లక్షణాలు కనిపించిన 24-48 గంటలలోపు చికిత్స చేయనట్లు అయితే పశువు చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వ్యాధి సోకిన పశువులలో 106-107$^0$ ఫారెన్ హీట్ జ్వరం ఉంటుంది. కంటి నుంచి నీరు మరియు నోటి నుంచి చొంగ కారుతూ ఉంటాయి. గొంతు మరియు మెడ భాగాలలో వాపు గమనించవచ్చు. శ్వాశ కష్టమై పశువుల నుంచి గురక శబ్దం వస్తుంది.

**వ్యాధి చికిత్స మరియు నివారణ చర్యలు :** వ్యాధి సోకిన పశువులలో సల్ఫాడిమిడిన్‌తో పాటు, యాంటి ఇన్ఫలమేటరీ, యాంటి అనాల్జేసిక్ ఇంజెక్షన్లు మరియు బి-కాంప్లెక్సు విటమిను ఇంజెక్షన్లను పశువైద్యుని సలహాతో ఇవ్వాలి. వ్యాధి సోకిన పశువులను ఉంచిన పాకలను 0.5% ఫెనాయిల్‌తో శుభ్రం చేయాలి.

వ్యాధి రాకుండా అరికట్టడానికి వర్షాకాలానికి ముందు పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి.

**గాలికుంటు వ్యాధి :**

ఈ వ్యాధి పికార్నో విరిడే కుటుంబానికి చెందిన ఆఫ్తో వైరస్ వలన వస్తుంది.

**వ్యాధి వ్యాప్తి :** కలుషితమైన ఆహారం, నీరు మరియు గాలి ద్వారా వైరస్ ఒక పశువు నుంచి మరొక పశువుకు వ్యాధి సోకుతుంది. పాల ద్వారా తల్లి నుంచి దూడలకు వ్యాపిస్తుంది

**వ్యాధి లక్షణాలు :** వ్యాధి సోకిన పశువులలో 105 -106$^0$ ఫారెన్ హీట్ జ్వరం ఉంటుంది. మొదటిగా నోటి లోపల, కాలిగిట్టల



**గాలికుంటు వ్యాధి**

మధ్య మరియు పొదుగు పైన బొబ్బలు ఏర్పడి ఆ తర్వాత అవి పుండ్లుగా మారతాయి వీటి వలన పశువు సరిగా నడవలేదు మరియు మేత మేయలేక నీరసించి పోతుంది. పాల ఉత్పత్తి గణనీయముగా తగ్గుతుంది. ఈ పుండ్ల ద్వారా సూక్ష్మ క్రిములు పశువు శరీరం లోపలికి వెళ్లి ద్వితీయ బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది.

**వ్యాధి చికిత్స మరియు నివారణ చర్యలు :** కాలిగిట్టల మధ్య మరియు పొదుగుపైనా ఏర్పడిన పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడగాలి. పుండ్లపై బోరిక్ పౌడర్ మరియు గ్లిసరిన్ కలిపిన పేస్టును పూయాలి. వ్యాధి బారిన పడ్డ పశువులు సరిగా ఆహారం తీసుకోలేవు కావున రాగి జావ వంటివి త్రాగించడం మంచిది.

సంవత్సరానికి రెండు సార్లు ఫిబ్రవరి మరియు ఆగస్టు నెలలో వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి.

**సన్న జీవాలలో (మేకలు మరియు గొర్రెలలో) వచ్చే వ్యాధులు:**

**కాలిగిట్టల పుండ్ల వ్యాధి / ఫుట్ రాట్ :**

ఈ వ్యాధి ఫ్యుసోబాక్టీరియా నెక్రోఫోరం మరియు డైక్లోబాక్టర్ నోడోసస్ అనే బాక్టీరియా వలన వస్తుంది.

**వ్యాధి వ్యాప్తి :** వ్యాధిగ్రస్థ జీవాలు ఉన్న పాకలు, తిరిగిన పచ్చిక బయళ్లు మరియు రవాణా చేసిన వాహనముల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

**వ్యాధి లక్షణాలు :** కాలి గిట్టల మధ్య వాపు కలిగి చర్మము ఎర్రగా కంది పగుళ్లు ఏర్పాడతాయి, నొప్పితో కుంటుతూ



**కాలిగిట్టల పుండ్ల వ్యాధి / ఫుట్ రాట్**

నడుస్తుంటాయి. నొప్పి వలన నడవలేక మంద నుంచి వెనక పడిపోతాయి, గిట్టల మధ్య పగుళ్లు ఏర్పడి పసుపుపచ్చగా కనిపిస్తాయి, వ్యాధి తీవ్రత ఎక్కువైనప్పుడు దుర్వాసన వస్తుంది మరియు గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది.

**వ్యాధి చికిత్స మరియు నివారణ చర్యలు :** వ్యాధి సోకిన జీవాలలో కాలిపుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో

శుభ్రపరిచి హిమాక్స్, లోరాక్సిన్ వంటి పూత మందులను పూయాలి. వారానికి మూడుసార్లు యాంటిసెప్టిక్ ద్రావణాలైన జింక్ సల్ఫేట్ (10%), కాపర్ సల్ఫేట్ (10%), ఫార్మలిన్ ద్రావణాలతో గిట్టలను శుభ్రపరచాలి. వ్యాధి సోకిన జీవాలకు యాంటి ఇన్ఫలమేటరీ మరియు రోగ క్రిమి నాశక (యాంటి బయోటిక్) మందులను వాడాలి.

జీవాలను చిత్తడి, బురద నేలల్లో ఉంచరాదు మరియు మేపరాదు. పాకలలో తేమ లేకుండా చూసుకోవాలి తేమ ఉన్నట్లైతే జింక్ సల్ఫేట్ లేదా కాపర్ సల్ఫేట్ లేదా బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. వ్యాధి సోకిన జీవాలను మందనుంచి వేరుచేసి చికిత్స చేయాలి. 10 రోజుల కొకసారి గిట్టలను యాంటిసెప్టిక్ ద్రావణంలో ముంచాలి.

### చీడ పారుడు వ్యాధి / ముసర వ్యాధి / ప్లేగు వ్యాధి :

ఈ వ్యాధిని పారమిక్సో విరిడే కుటుంబానికి చెందిన మార్బిలి వైరస్ కలుగచేస్తుంది. మందలో ఈ వ్యాధి వ్యాప్తి 50-90 శాతం వరకు ఉంటుంది, అలాగే మరణాల శాతం 30-50 శాతం వరకు ఉంటుంది.

**వ్యాధి వ్యాప్తి :** కలుషితమైన ఆహారం మరియు నీటిని తీసుకోవడం ద్వారా జీవాలకు ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

**వ్యాధి లక్షణాలు :** 104-105 డిగ్రీల ఫారెన్ హీట్ జ్వరంతో జీవాలు బాధపడుతుంటాయి, ముక్కు నుంచి చీమిడి కారుతూ ఉంటుంది, దుర్వాసనతో కూడిన విరేచనాలు మరియు జీవాల మూతి చుట్టూ మరియు పెదవులపైనా పుండ్లు మనం గమనించ వచ్చు.

**వ్యాధి చికిత్స మరియు నివారణ చర్యలు :** వైరల్ వ్యాధి కనుక చికిత్స లేదు. పశు వైద్యుల సలహామేరకు తగిన మందులను వాడాలి. జీవాలకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి డిసెంబర్, మే నెలల మధ్య తప్పనిసరిగా టీకాలను వేయించాలి. మందలో మూడు నెలలు పైబడిన అన్ని పిల్లలకు టీకాలు వేయించాలి.

### నీలి నాలుక వ్యాధి :

ఈ వ్యాధి రియో విరిడే కుటుంబానికి చెందిన ఆర్బీ వైరస్ వలన కలుగుతుంది.

**వ్యాధి వ్యాప్తి :** క్యూలికాయిడ్స్ అనే దోమ కాటు ద్వారా ఈ వ్యాధి ఒక పశువు నుంచి మరొక పశువుకు వ్యాప్తి చెందుతుంది.

**వ్యాధి లక్షణాలు :** వ్యాధి సోకిన పశువులు 104-106$^{0}$ ఫారెన్ హీట్ జ్వరంతో బాధ పడుతుంది. గొర్రెలు పారుతూ ఉంటాయి, ముక్కు నుంచి జిగురు లాంటి ద్రవ పదార్థం కారుతూ ఉంటుంది. గిట్టల దగ్గర ఎర్రగా వాచి గొర్రెలు కుంటుతూ ఉంటాయి. ముక్కు మరియు కంటి నుంచి నీరు కారుతుంటుంది. నోటిలో పుండ్లు (అల్సర్లు) ఏర్పడి చిగుళ్లు వాచి ఉంటాయి.

**వ్యాధి చికిత్స మరియు నివారణ చర్యలు :** వైరల్ వ్యాధి కనుక చికిత్స లేదు. పశు వైద్యుల సలహామేరకు తగిన మందులను వాడాలి. వ్యాధి రాకుండా జీవాలకు ప్రతి సంవత్సరానికి ఒకసారి (ఆగస్టు నుంచి అక్టోబర్ మధ్యలో) టీకాలు వేయించాలి.

### చిటుక రోగం / నెత్తి పిడుగు రోగం :

ఈ వ్యాధి క్లాస్ట్రిడియం పెర్ఫరింజెస్ అనే బాక్టీరియా వలన గొర్రెలు, మేకలలో కలుగుతుంది. ఈ బాక్టీరియా విడుదల చేసే ఎప్సిలాన్ అనే విష పదార్థం పశువు యొక్క నాడీకణ వ్యవస్థపై పని చేయడం వలన ఈ వ్యాధి సోకిన పశువుల్ని మనం గుర్తించే లోపే వాటి ప్రాణాలు పోవడం జరుగుతుంది. వ్యాధి సోకిన పశువులు రెప్పపాటులో చనిపోతాయి కనుకనే దీనికి చిటుక రోగం అనే పేరు.

**వ్యాధి వ్యాప్తి :** కలుషితమైన ఆహారాన్ని తీసుకోవడం వలన పశువులలో వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

**వ్యాధి లక్షణాలు :** గొర్రెలు ఎటువంటి లక్షణాలు చూపించకుండానే చనిపోతాయి. కొన్ని గొర్రెలలో విరోచనాలు, కండరాలు కొట్టు కోవడం, కళ్ళు సరిగా కనిపించక ఎదురుగా ఉన్న వాటిని డీ కొనడం, పళ్ళు కొరకడం, శ్వాశ ఇబ్బందులు వంటివి కనిపి స్తాయి.

**వ్యాధి చికిత్స మరియు నివారణ :** వ్యాధి సోకిన పశువులలో సెఫాలోస్పోరిన్స్, పెన్సిలిన్స్, టెట్రాసైక్లిన్స్, యాంటీ అనాల్జేసిక్, యాంటి ఇన్ఫలమేటరీ ఇంజెక్షన్లు మరియు బి-కాంప్లెక్సు విటమిను ఇంజెక్షన్లను పశువైద్యుని సలహాతో ఇవ్వాలి.

వ్యాధి రాకుండా అరికట్టడానికి పశువుల మేతలో మార్పులను నెమ్మదిగా చేయాలి, ఆకస్మికంగా మేతను మార్చరాదు. 6 నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలను గొర్రెలకు ఇవ్వాలి. వర్షాకాలం రాకముందే గొర్రెలకు డీవార్మింగ్ చేయించాలి.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 93986 26447

# చేపల పెంపకానికి అనువైన రకాల ఎంపికలో పాటించాల్సిన మెళకువలు

డా॥ సి.హెచ్. బాలకృష్ణ, శాస్త్రవేత్త (మత్స్య శాస్త్రం); డా॥ ఏ. దేవీ వరప్రసాద్ రెడ్డి, శాస్త్రవేత్త (మత్స్య శాస్త్రం), కె.వి.కె. వెంకటరామన్న గూడెం, డా॥ యం. శ్యాం ప్రసాద్, శాస్త్రవేత్త (మత్స్య శాస్త్రం); కె.వి.కె., మమ్నూర్, వరంగల్ మరియు డా॥ డి. చిన్నం నాయుదు, కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఆమదాలవలస.

తెలుగు రాష్ట్రాలలో చేపల పెంపకం ముఖ్యంగా సాంప్రదాయ, విస్తృత, పాక్షిక సాంద్ర, మరియు సాంద్ర పద్ధతుల్లో చేపట్టడం జరుగుతున్నది. రైతులు కమ్యూనిటీ చెరువులలో, పంచాయతీ చెరువులలో మరియు తయారు చేసిన చెరువులలో గానీ చేపల సాగు చేపట్టే ముందు వాటి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అంటే, నీటి వనరులను బట్టి, ఆహారపు అలవాట్లను బట్టి, సాగుకు అనువుగా ఉండే చేపల రకాలను ఎంపిక చేసుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవడం వలన సాగు కాలంలో వాటి మరణాల శాతాన్ని తగ్గించుకోవచ్చు. నీటి వనరులలో సహజంగా దొరికే అన్ని రకాల చేపలు పెంపకానికి అనువుగా ఉండవు.

**చేపల పెంపకానికి అనువుగా ఉండే రకాల లక్షణాలు :**

చేపల పెంపకానికి ఉపయోగించే నీటి వనరులను బట్టి ఎంచుకున్న చేపల ఆహారపు అలవాట్లను బట్టి చెరువులలో చేపలను పెంపకానికి ఎంపిక చేసుకోవాలి. తక్కువ సమయంలో ఎక్కువ పెరుగుదలను చూపిస్తూ నీటి వనరులలో ఉండే సహజ మేత అయినా వృక్ష, జంతు ప్లవకాలు తీసుకుంటూ, అనుబంధంగా ఇచ్చే మేతలను కూడా తీసుకునే విధంగా ఉండాలి. అంతేకాకుండా వాతావరణంలో అప్పటికప్పుడు వచ్చే మార్పులను తట్టుకునే విధంగా ఉండాలి. ఇండియన్ మేజర్ కార్ప్ రకాలయిన కట్ల (బొచ్చె), రోహు (రాగండి), మ్రిగాల (ఎర్రమైల) రకాలు పెంపకానికి చాల అనువైనవి.

**బొచ్చె :** బొచ్చె రకం ముఖ్యంగా జంతు ప్లవకాలు, ఆల్గే మొక్కలు, కీటకాలు వంటి వాటిని ఆహారంగా తీసుకుని, మంచి యాజమాన్య పద్ధతులను గానీ పాటించినట్లయితే ఇవి సంవత్సరానికి 1.5 నుండి 4 కిలోల బరువు వరకు పెరుగుతాయి.

**రాగండి :** రాగండి రకం, ఇవి ఎక్కువగా వృక్ష ప్లవకాలు, చిన్న సైజులో ఉన్న ఆల్గే, కుల్లుతున్న పదార్థాలను ఎక్కువగా తీసుకుంటాయి. ఇవి సంవత్సర పంట కాలంలో 1 నుండి 3 కేజీల వరకు పెరుగుదల కలిగి ఉండి చెరువులో ఎక్కువ సంఖ్యలో వేసుకుని అధిక ఉత్పత్తి సాధించడానికి వీలుంటుంది.



**ఎర్రమైల :** ఎర్రమైల రకం, ఇది ఎక్కువగా కుల్లుతున్న సేంద్రీయ పదార్థాలను, అలాగే చనిపోయిన వృక్ష జంతు సంబంధ పదార్థాలను ఆహారంగా తీసుకుంటాయి. ఈ మూడు రకాలు తవుడు, వేరుశనగ చెక్క, ప్రత్తి చెక్క, మరియు సోయా చెక్క వంటి వాటిని అనుబంధ ఆహారంగా ఇచ్చినప్పుడు అధిక పెరుగుదలను చూపిస్తాయి.

వీటితో పాటు విదేశీ రకాలయిన గడ్డి చేప, బంగారు తెగ, వెండి చేప రకాలను కూడా పెంచుకోవచ్చును. వెండి చేప ముఖ్యంగా, నీటి ఉపరితలంలో ఉండే వృక్ష ప్లవకాలును ఎక్కువగా ఆహారంగా తీసుకుంటాయి ఇవి సంవత్సర కాలంలో 1.5 నుండి 3 కిలోల వరకు బరువు పెరుగుతాయి.

**గడ్డి చేప :** గడ్డి చేప రకం ముఖ్యంగా వృక్ష జంతు ప్లవకాలు, మెత్తటి గడ్డి, లెమ్నా, హైడ్రిల్లా, వాలిస్నేరియా వంటి నీటి మొక్కలను ఆహారంగా తీసుకుంటాయి. కలుపు మొక్కల బెడద ఎక్కువగా ఉండే కమ్యూనిటీ చెరువులు, పంచాయతీ చెరువుల్లో ఈ రకం చేపలు ఎక్కువగా వేసుకుంటే అధిక ఉత్పత్తిని సాధించవచ్చును. గడ్డి చేప రకం ఒక రోజులో తన శరీర బరువుకు మూడు రెట్ల బరువు ఉండే ఆహారాన్ని తీసుకుంటాయి. ఇవి ఒక సంవత్సర పంట కాలంలో 2.5 నుండి 5 కిలోల వరకు పెరుగుదల చూపిస్తాయి.

**బంగారు తీగ :** బంగారు తీగ రకం ముఖ్యంగా కీటక లార్వాలు పురుగులు అడుగు భాగంలో ఉండే సేంద్రియ పదార్థాన్ని ఎక్కువగా ఆహారంగా తీసుకుంటాయి సంవత్సర కాలంలో 1.5 నుండి 3.5 కిలోల వరకు పెరుగుదల చూపిస్తాయి.

**చేప పిల్లల విడుదల సంఖ్య :**

ఈ విధంగా పెంపకానికి ఎంపిక చేసుకున్న చేపలను నీటి వనరులను బట్టి ఏ ఏ నిష్పత్తిలో వేయాలో నిర్ణయించు కోవాలి. బొచ్చె, రాగండి, ఎర్రమైల రకాలను మాత్రమే సాగుకు ఎంచుకున్నట్లయితే వీటిని 3:5:2 నిష్పత్తిలో చెరువులో విడిచిపెట్టాలి. ఈ మూడు రకాలతో పాటు బంగారు తీగ రకాన్ని కూడా ఎంచుకుంటే బొచ్చె, రాగండి, ఎర్రమైల, బంగారు తీగ రకాల నిష్పత్తి 3:4:1:2 గా ఉండేట్లు చూసుకోవాలి. కలుపు మొక్కల బెడద ఎక్కువగా ఉండే చెరువుల్లో కనీసం పది శాతం వరకు గడ్డి చేపలను విడిచి పెట్టేలా చర్యలు తీసుకోవాలి.

**మిశ్రమ పెంపక విధానానికి అనువైన రకాలు :**

కార్ప్ రకాలతో పాటు తొందరగా పెరుగుదల చూపించి, నీటి లోతు తక్కువగా ఉన్నప్పుడు కూడా తట్టుకోగలిగే, పంగాషియస్ రకాలను, మార్పు రకాలను కూడా సాగుకు ఎంపిక చేసుకో వచ్చును. తక్కువ కాలం పాటు నీరు ఉండే చెరువుల్లోనూ నీటి లోతు తక్కువగా ఉండే చెరువుల్లో ఈ రకం చేపలు అధిక సాంద్రతలో పెంపకానికి అనువుగా ఉంటాయి.

మంచినీటి చేపలతో పాటు నీలకంట రొయ్యలను కూడా సాగు చేయడం వల్ల అధిక లాభాలను పొందవచ్చును, రొయ్యలను ఎకరాకు 10 వేల వరకు విడుదల చేసుకోవచ్చును. చేపలతో స్కాంపి రొయ్యల పెంపకం చేపట్టేటప్పుడు అడుగు భాగంలో తిరిగే చేపల రకాలైన ఎర్రమల, బంగారు తీగ రకాల సంఖ్యను తగ్గించుకోవాలి.

చేపల పెంపకానికి ఉపయోగించే నీటి వనరులను బట్టి, ఆహారపు అలవాట్లను బట్టి చేపల రకాలను ఎన్నుకోవాలి. చేపలను ఉత్పత్తి చేసిన వెంటనే అంటే గుడ్డు లేదా స్పాంజ్ దశలో నేరుగా చెరువులలో వదిలి నట్లయితే అలల తాకిడికి తట్టుకోలేక ఎక్కువ సంఖ్యలో చనిపోతాయి. అందువల్ల నర్సరీ చెరువుల్లో స్పాను దశ నుండి ఫ్రై లేదా ఫింగర్ లింగ్ దశ వరకు పిల్లలను పెంచుకోవాలి. ఈ విధంగా పెంచిన చేప పిల్లలను ఒత్తిడికి గురి కాకుండా, ఉత్పత్తి స్థానం నుండి పెంపక చెరువుల వరకు జాగ్రత్తగా రవాణా చేసుకోవాలి. ఈ విధంగా ఎంపిక చేసుకున్న చేపల రకాలను కాలుష్యం లేని వాతావరణ పరిస్థితుల్లో ఉన్న నర్సరీ చెరువుల నుండి గాని, రేరింగ్ చెరువుల నుండి గాని, వాటి నాణ్యతను ముందుగా పరీక్షించి ఆరోగ్యంగా ఉండే చేప పిల్లలు మాత్రమే సేకరించుకోవాలి. ఆలస్యంగా నీరు చేరే చెరువుల్లోనూ, తక్కువ కాలం పాటు నీరు ఉండే చెరువుల్లోను ఫింగర్ లింగ్ సైజు అంటే 5 నుండి 8 సెంటీ మీటర్ల సైజు చేప పిల్లలను గాని, సంవత్సరం వయసు ఉన్న చేప పిల్లలను (100-250 గ్రా.) గాని విడుదల చేసుకోవాలి.

**నాణ్యమైన చేప పిల్లల ఎంపిక :**

- వ్యాధి సోకని ఆరోగ్యంగా ఉండే ఒకే సైజు చేప పిల్లలను ఎంచుకోవాలి.
- ఈ చేప పిల్లలను హాపాలో గానీ, బేసిన్ లో గానీ వేసినప్పుడు అవి చురుకుగా తిరుగాడుతూ హపా అంచుల వెంబడి ఎక్కువగా కనబడతాయి.
- చేప పిల్లలను బేసిన్లో వేసి చూసినప్పుడు పిల్లలు తల తల మెరుస్తూ ఉండాలి.
- ఒకే పరిమాణం గల చేప పిల్లలను ఎంపిక చేసుకున్నట్లయితే పెంపక కాలంలో చేపలు సమానంగా పెరుగుతాయి.
- చేప పిల్లల తోక లేదా రెక్క భాగాలను పరిశీలిస్తే ఎటువంటి కొరుకుడు కానీ, చీలినట్లు కానీ లేకుండా ఉన్న వాటిని ఆరోగ్యవంతమైనవిగా గుర్తించుకోవాలి.

**చెరువు నీటి గుణాలకు చేప పిల్లలను అలవాటు పరచుట :**

సాధారణంగా చేప పిల్లల ఉత్పత్తి స్థానం, పెంపక చెరువుల నీటి వాతావరణ పరిస్థితులు వేరుగా ఉంటాయి, కనుక చేపలు పెంచే నీటిలో పిల్లలను వదిలే ముందు నీటి వాతావరణ పరిస్థితులకు అంటే ఉష్ణోగ్రత, ఉదజని సూచిక (పి.హెచ్.) లకు అలవాటు చేసుకోవాలి, లేకపోతే ఒక్కసారిగా ఏర్పడే మార్పులకు అధిక ఒత్తిడికి గురై ఒక్కసారిగా ఎక్కువ సంఖ్యలో చేప పిల్లలు చనిపోయే అవకాశం ఉంది. చేప పిల్లలను చెరువులో చల్లని వాతావరణంలో అంటే ఉదయం సమయంలో, అలల తాకిడి తక్కువగా ఉన్నటువంటి ప్రదేశంలో విడిచి పెట్టాలి. పిల్లల బ్యాగును 15 నిమిషాల పాటు విప్పకుండా చెరువు నీటిలో ఉంచాలి. ఈ విధంగా చేయడం వలన ఉష్ణోగ్రతలు సమాన స్థితిలోకి వస్తాయి. తర్వాత చెరువు నీటిని బ్యాగులోకి నెమ్మదిగా వంచుతూ చెరువు నీటిని పట్టుకోవాలి, తర్వాత బ్యాగ్‌లోని చేప పిల్లలను నీటితో సహా నెమ్మదిగా చెరువులోకి వదులుకోవాలి.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 94407 92616

# పంటల భీమా పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ ముందంజ

డా॥ జి. రఘునాధ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (ఆర్థిక శాస్త్రం); డా॥ యం. చంద్రశేఖర్ రెడ్డి, శాశ్వత కార్యనిర్వాహక సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ అగ్రిమిషన్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం.

**భా**రతదేశ వ్యవసాయ రంగంలో ముఖ్యంగా దీర్ఘకాలిక కరువులు, వరదలు మరియు వాతావరణంలో మార్పులకు చాలా అవకాశం ఉంది. పంటల భీమా అనేది వివిధ ఉత్పత్తి ప్రమాదాల ఫలితంగా వారి పంటలను దెబ్బతీయడం మరియు నాశనం చేయడం వల్ల రైతులు అనుభవించే ఆర్థిక నష్టాలను తగ్గించడానికి ఉద్దేశించిన ఒక ఏర్పాటు. పంటల భీమా ద్వారా అకాల వర్షపాతం, వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలతో సంబంధం ఉన్న పంట ప్రమాదాల నుంచి రైతులను కాపాడటానికి ప్రభుత్వం చేసిన ఒక ప్రాథమిక వ్యూహం. ఈ నేపథ్యంలో, భారత ప్రభుత్వం గత ఐదు దశాబ్దాలుగా జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (1972-79), పైలట్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్ (1979-85), సమగ్ర పంటల భీమా పథకం (1985-99), జాతీయ వ్యవసాయ భీమా పథకం (1999-2010), సవరించిన జాతీయ వ్యవసాయ భీమా పథకం (2010-16), వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం (2003-16), మరియు ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన (2016-17) వరకు సవరించిన వాతావరణ ఆధారిత పంటలు భీమా పథకం సహా వివిధ కార్యక్రమాలను ప్రారంభిం చింది.

ప్రస్తుతం ఉన్న పంటల భీమా వ్యవస్థలో ఉన్న పరిమితులను గ్రహించి, క్లెయిమ్‌లను తొందరగా చెల్లించడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు వై.ఎస్.ఆర్. రైతు దినోత్సవంగా జరుపుకునే జూలై 8, 2019 లో డా॥ వై.ఎస్.ఆర్. ఉచిత పంటల భీమా పథకాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది.

రాష్ట్రంలోని నోటిఫైడ్ పంటలని పండించే రైతులు ఆర్.బి.కె.లో ఒక రూపాయి చెల్లించి ఇ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకోవడం ద్వారా భీమా పరిధిలోకి చేర్చబడ్డారు. టోకెన్ మొత్తం రూ. 1 ఖరీఫ్ 2020-21 నుండి మాఫీ చేసి, దీనిని ఉచిత పంట భీమా పథకంగా ప్రకటించారు. ఈ పథకం మండల ఇన్సూరెన్స్ యూనిట్ గా అన్ని నోటిఫైడ్ పంటలు ఉన్న ప్రాంతాలకు వర్తిస్తుంది. ఉచిత పంట భీమా పరిధిలోకి వచ్చిన ప్రాంతం 2018-19 లో 25.99 లక్షల హెక్టార్ల నుంచి 2021-22 లో 37.46 లక్షల హెక్టార్లకు పెరిగింది, అదే మాదిరి, భీమా మొత్తం రూ. 10804/- కోట్ల నుంచి రూ. 32692/- కోట్లు కు (140 శాతం) పెరుగింది. 2018-19 లో 38.02 శాతంగా ఉన్న ప్రీమియంలో రాష్ట్ర వాటా 2019-20 లో రైతుల ప్రీమియంలోని మొత్తం వాటా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తున్నందున 65.85 శాతంకి చేరుకుంది (పట్టిక 1). 2018-19 సంవత్సరానికి చెల్లించకుండా మిగిలిపోయిన క్లెయిమ్‌ల విలువ రూ. 715.84 కోట్లు 2019-20 సంవత్సరంలో 6.19 లక్షల మంది రైతులకు చెల్లించారు. గడచిన రెండు సంవత్సరాలు ప్రపంచం మొత్తం కోవిడ్-19 ఉచ్చులో ఉన్నపటికీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరుసగా మూడవ సంవత్సరం కూడా 2022-23 ఖరీఫ్ కోసం 2,977.82 కోట్ల రూపాయలను 15.61 లక్షల మంది రైతులకు పంటల భీమా సొమ్ము జమ చేసింది. 41.36 లక్షల మంది రైతులు పంటల భీమా పరిధిలోకి రాగా, 37.72 శాతం మంది రైతులు ఈ ఏడాది లబ్ధి పొందారు. రైతు అందుకున్న సగటు క్లెయిమ్ లను పరిశీలిస్తే 18,666/- రూపాయలతో 2021-22 లో అత్యధికంగా ఉంది.

ఉచిత పంటల భీమా పథకం ప్రవేశపెట్టిన తర్వాత 2019 లో భీమా కోసం నమోదు చేసుకున్న రైతుల సంఖ్య 167.04 శాతానికి పెరిగింది. నమోదు చేసుకున్న రైతుల సంఖ్య 2018-19 లో 29.13 శాతం నుండి 2019-20 లో 58.43 శాతం కి, 2020-21 లో 83.65 శాతం కి మరియు 2021-22 లో 48.52 శాతం కి పెరిగింది (చిత్రం 1). 2018-19 మరియు 2021-22 మధ్య లబ్ది పొందిన రైతుల సంఖ్య కూడా 21.24 శాతం పెరిగింది. ఇది క్షేత్రస్థాయిలో పథకం యొక్క పారదర్శకత మరియు సమర్థవంతమైన అమలును వెల్లడిస్తుంది. సమయానుకూల పర్యవేక్షణ, పంట కోత ప్రయోగాలు, నష్ట పరిహారం నిర్ధారించటం మరియు క్లెయిమ్‌ల చెల్లింపులు వంటివి భీమా కోసం రైతుల అంచనాలను పెంచాయి.

ఇంతకు ముందు, రైతులకు సకాలంలో చెల్లించే పంటల భీమా విధానాలపై అవగాహన లేదు, క్లెయిమ్ మొత్తం ఎంత

**పట్టిక 1 : ఆంధ్రప్రదేశ్ లో 2016-17 నుండి 2021-22 వరకు పంటల భీమా వివరాలు**

| వివరాలు | ఉచిత పంట భీమా పథకానికి ముందు | | | | ఉచిత పంట భీమా పథకం తర్వాత | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | 2016-17 | 2017-18 | 2018-19 | సగటు 2016-18 | 2019-20 | 2020-21 | 2021-22 | సగటు 2019-21 | పెరుగుదల / తగ్గుదల |
| పథకం పరిధిలోకి వచ్చిన రైతుల సంఖ్య (లక్షల్లో) | 17.79 (20.87) | 18.22 (21.37) | 24.83 (29.13) | 20.28 | 49.81 (58.43) | 71.30 (83.65) | 41.36 (48.52) | 54.16 | పెరుగుదల (167.04%) |
| విస్తీర్ణం (లక్ష హెక్టార్లలో) | 20.44 | 24.28 | 25.99 | 23.57 | 45.96 | 61.75 | 37.46 | 48.39 | పెరుగుదల (104.30%) |
| భీమా మొత్తం (రూ. కోట్లు) | 10,804 | 12,625 | 14,025 | 12,485 | 29,875 | 27,230 | 32,692 | 29,932 | పెరుగుదల (139.75%) |
| రైతు ప్రీమియం (రూ. కోట్లు) | 347.96 (43.27) | 261.29 (19.61) | 262.01 (23.97) | 290.42 | 0.26 (0.017) | శూన్యం | శూన్యం | - | - |
| ప్రీమియంలో కేంద్ర వాటా (రూ.కోట్లు) | 228.06 (28.36) | 535.56 (40.19) | 415.62 (38.02) | 393.08 | 503.36 (34.103) | శూన్యం | శూన్యం | - | - |
| ప్రీమియంలో రాష్ట్ర వాటా (రూ.కోట్లు) | 228.06 (28.36) | 535.56 (40.19) | 415.62 (38.02) | 393.08 | 971.23 (65.85) | శూన్యం | శూన్యం | - | - |
| స్థూల ప్రీమియం (రూ. కోట్లు) | 804.08 | 1,332.41 | 1,093.25 | 1,076.58 | 1,474.85 | శూన్యం | శూన్యం | - | - |
| చెల్లించిన పరిహారాలు (రూ. కోట్లు) | 954.74 | 720.60 | 1860.28 | 1178.54 | 1252.18 | 1739.0 | 2977.82 | 1968 | పెరుగుదల (66.96%) |
| ప్రయోజనం పొందిన రైతుల సంఖ్య (లక్షల్లో) | 8.70 (48.90) | 6.76 (37.10) | 15.94 (64.20) | 10.47 | 9.48 (19.03) | 13.00 (18.23) | 15.60 (37.72) | 12.69 | పెరుగుదల (21.24%) |
| రైతు అందుకున్న సగటు క్లెయిమ్ | 10,974 | 10,660 | 11,671 | 11,101 | 13,209 | 13,377 | 18,666 | 15,084 | (35.88%) |
| క్లెయిమ్లకు వ్యతిరేకంగా ప్రీమియం నిష్పత్తి | 1.19 | 0.54 | 1.70 | 1.14 | 0.85 | 0 | - | - | - |


**ఆధారము : apagrisnet.gov.in**

**గమనిక :** (1) కుండలీకరణాల్లోని గణాంకాలు ఆయా సూచిక మొత్తానికి శాతాన్ని సూచిస్తాయి.
(2) ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం రైతుల సంఖ్య 85.24 లక్షలుగా పరిగణించబడింది.


వరకు వస్తుందో అనే సందిగ్ధంలో ఉండేవారు మరియు రుణం పొందిన రైతులు మాత్రమే తప్పనిసరి పంట భీమా పథకం కింద లబ్ధి పొందేవారు. కాగా, వై.ఎస్.ఆర్. ఉచిత పంట భీమా పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత, ప్రీమియం చెల్లించకుండానే ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకున్న రైతులందరికీ భీమా అందించ బడుతుంది.

రైతులందరికీ పంటల భీమా అమలు చేయడమే కాకుండా, ప్రభుత్వం ఆమోదించిన నష్టపరిహారం అదే సంవత్సరంలోనే లబ్ధిదారులకు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెల్లిస్తుంది. 2021-22 ఉత్పత్తి కాలంలో భీమా క్లెయిమ్ తదుపరి విత్తే సీజన్ ప్రారంభించడానికి చాలా ముందు, 14 జూన్ 2022 న ఇటీవల చెల్లించబడింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భీమా క్లెయిమ్‌లను సకాలంలో చెల్లించడం భారతదేశ చరిత్రలో ఇదే తొలిసారి. 2019 నుండి రైతులు చెల్లించే ప్రీమియం సున్నాగా మారింది, అయితే క్లెయిమ్‌ల చెల్లింపులు పెరుగుతున్న దిశలోనే ఉన్నాయి (చిత్రం 2).

2021-22 లో వై.ఎస్.ఆర్ పంటల భీమా పథకం ద్వారా కర్నూలు జిల్లాలో ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందారు,




చిత్రం 1 : ఆంధ్రప్రదేశ్‌లో పంటల భీమా పరిధి లోకి వచ్చిన రైతులు మరియు లబ్ధి పొందిన రైతుల యొక్క గణాంకాలు




చిత్రం 2 : ఆంధ్రప్రదేశ్‌లోని రైతులు చెల్లించిన ప్రీమియం మరియు స్వీకరించిన క్లెయిమ్‌లు

ఆ తర్వాత అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా రైతులు ఎక్కువగా లబ్ధి పొందారు. అయితే, అనంతపురం జిల్లా రైతులకు ఎక్కువ క్లెయిమ్‌లు చెల్లించారు, ఆ తర్వాత స్థానం లో కర్నూలు, వై.ఎస్.ఆర్. కడప జిల్లాలు ఉన్నాయి.

**భవిష్యత్ మార్గం :**

- రైతులకు భరోసా ఇవ్వడానికి దిగుబడి ఆధారిత భీమా క్రింద, నిర్దిష్ట గ్రామంలో పండించే ప్రధాన పంటలను చేర్చాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఒక్క ప్రధాన పంటను మాత్రమే గ్రామ పరిధిలోకి అనుమతిస్తున్నారు. పంటల వైవిధ్యీకరణకు

**పట్టిక 2 : ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా ఉచిత పంట భీమా వివరాలు (2021-22)**

| సం. | లబ్ధి పొందిన రైతుల సంఖ్య | | రైతులకు అందించిన క్లెయిమ్‌లు | |
|---|---|---|---|---|
| | జిల్లా | సంఖ్య | జిల్లా | రూ. (కోట్లలో) |
| 1 | కర్నూలు | 2,84,522 (18.23 ) | అనంతపురం | 629.77 (21.15) |
| 2 | అనంతపురం | 2,32,580 (14.90) | కర్నూలు | 339.61 (11.40) |
| 3 | శ్రీ సత్యసాయి | 1,71,881 (11.01) | వై.ఎస్.ఆర్. | 285.71 (9.59) |
| 4 | ప్రకాశం | 1,10,729 (7.09) | ప్రకాశం | 275.35 (9.25) |
| 5 | వై.ఎస్.ఆర్ | 90,553 (5.80) | శ్రీ సత్యసాయి | 255.78 (8.59) |
| 6 | ఇతర జిల్లాలు | 6,70,438 (42.96) | ఇతర జిల్లాలు | 1191.60 (10.02) |
| | మొత్తం | 15,60,703 (100) | మొత్తం | 2977.82 (100) |

ఆధారము : apagrisnet.gov.in

వెళ్లడానికి రైతులను ప్రోత్సహించడానికి ఇది మంచి మార్గం కాగలదు.

- మార్కెట్ భీమా అమలు చేయడం వలన ముందుగా నిర్ణయించే ధరలతో పంటలను సేకరించడం ద్వారా ధరల ప్రమాదాన్ని దాటవచ్చు. ఈ విధంగా భీమా రంగంలో ముందుకు సాగే మార్గాలని ప్రారంభించి రైతులలో పంటలను పండించడానికి విశ్వాసాన్ని పెంపొందించాలి.
- భీమా పథకాన్ని గ్రామ స్థాయికి విలేజ్ ఇన్సూరెన్స్ యూనిట్ గా విస్తరించవచ్చు, తద్వారా చిన్న ప్రాంతంలో నష్టాలను కూడా తెలుసుకునేందుకు రైతులకు మరింత ప్రాతినిధ్యంగా ఉంటుంది మరియు అనవసరమైన చెల్లింపులను తగ్గించ వచ్చు.
- ఆంధ్రప్రదేశ్ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రస్తుతం ఉన్న సంస్థాగత పరిధి కంటే మెరుగ్గా పనిచేస్తుందని భావిస్తు, ఇలాంటి మంచి సంస్థను తీసుకురావడానికి ప్రయత్నాలు జరపాలని ఆశించడం జరుగుతుంది.
- ఇంతకు ముందు రైతులు భీమా క్రింద పంటలను నోటిపై చేయడానికి క్లిష్టతరమైన విధానాన్ని అనుసరించాల్సి ఉండేది, కానీ ఇప్పుడు వారు ఇ-క్రాప్ బుకింగ్ ద్వారా ఉచిత పంట భీమా కింద నేరుగా అర్హులయ్యారు, ఇది రైతులచే ప్రశంసించ బడింది. కాబట్టి, రైతుల ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం ప్రస్తుత పథకాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది.
- మొత్తం ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది కాబట్టి, భీమా రకంలో వ్యత్యాసం అంటే, దిగుబడి ఆధారిత మరియు వాతావరణ ఆధారిత భీమాలను తీసేసి ఖచ్చితమైన పర్య వేక్షణతో సగటు సాగు వ్యయానికి తగ్గట్టుగా నష్ట పరిహారాన్నీ ఒకే రకమైన భీమాను అందించడం ద్వారా రైతులందరికీ ప్రయోజనం చేకూరుతుంది.
- రాబోయే సీజన్లలో పథకంలో లబ్ధి పొందని రైతులను చేర్చుకునేలా అవగాహన కల్పించాలి. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సంస్కరణలు అనగా ఇ-క్రాప్ బుకింగ్ ద్వారా సకాలంలో రిజిస్ట్రేషన్‌ను అందించడం మరియు సాగుదారు లకు భౌతిక మరియు డిజిటల్ రసీదులను అందించి, పంట సాగు చేసిన భూమి గుర్తింపును నిర్ధారించవచ్చు మరియు సరైన హామీతో ఎక్కువ మంది రైతులను పంట భీమా పరిధిలోకి తీసుకురావచ్చు.
- తెగుళ్ళు&వ్యాధులు ఆకస్మికంగా వ్యాప్తి చెందడం, ఉత్పత్తి & ఎగుమతి అవసరం మరియు దేశీయ & అంతర్జాతీయ డిమాండ్ నేపథ్యంలో, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ శాఖ యొక్క ఆర్.బి.కె. వ్యవస్థతో ప్రాంతాల వారీగా సాగు చేయాల్సిన నిర్దిష్ట పంట రకాలను విత్తే కాలానికి ముందే రైతులకు అవగాహన కల్పించవచ్చు. పంటల భీమా ప్రధానంగా వ్యవసాయ శాఖ సూచనలను అనుసరించే రైతులకు మాత్రమే వర్తించేలా చేయవచ్చు, తద్వారా ఎక్కువ విస్తీర్ణంలో మేలైన నష్ట నివారణ సాగును అనుసరించడం ద్వారా సుస్థిరమైన ఉత్పత్తితో ముందుకు సాగవచ్చు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 98483 21232

## శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శ్రీ అల్లూరి సీతారామరాజు గారి జయంతి తేది 04.07.2022 న పురస్కరించుకొని విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి గారు విశ్వవిద్యాలయ పరిపాలనా భవన ప్రాగణంలో శ్రీ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి పుష్ప నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శ్రీ అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని తమ తమ శాఖలలో విశేష కృషి సల్పి, విశ్వవిద్యాలయ ఉన్నతికి తమ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు : రిజిస్ట్రార్ మరియు ఉన్నత విద్యా పీఠాధిపతి డా॥ జి. రామారావు, వ్యవసాయ పీఠాధిపతి డా॥ ఏ. ప్రతాప్ కుమార్ రెడ్డి, పరిశోధనా సంచాలకులు డా॥ ఎల్. ప్రశాంతి, విస్తరణా సంచాలకులు డా॥ పి. రాంబాబు, సామాజిక విజ్ఞాన పీఠాధిపతి మరియు విశ్వవిద్యాలయ లైబ్రేరియన్ డా॥ సి.హెచ్. చిరంజీవి, బోధన మరియు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డా॥ వై.ఎస్.ఆర్. రైతు దినోత్సవం

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దివంగత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు డా॥ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి జన్మదినాన్ని పురస్కరించుకొని తేది జూలై 08, 2022 న డా॥ వై.ఎస్.ఆర్. రైతు దినోత్సవాన్ని విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి గారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఆహార శుద్ధి మరియు ఉద్యాన శాఖామాత్యులు శ్రీ కె. గోవర్ధన్ రెడ్డి గారు మరియు గౌరవ అతిథులుగా డా॥ ఆర్. శ్రీనాథ్ రెడ్డి గారు, కార్యనిర్వహణ అధికారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు, 47 వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి వై. పద్మావతి గారు విచ్చేసారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఆహార శుద్ధి మరియు ఉద్యాన శాఖామాత్యులు శ్రీ కె. గోవర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి గారు వారి సిబ్బంది సాధించిన విజయాలను ప్రశంసిస్తూ, విశ్వవిద్యాలయాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని దానికి మా సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అంతేకాక ఉదయగిరిలో దివంగత సమాచార సాంకేతికత మంత్రివర్యులు శ్రీ యం. గౌతమ్ రెడ్డి గారి జ్ఞాపకార్థం వారి తండ్రి గారైన శ్రీ యం. రాజమోహన రెడ్డి మెరిట్స్ కళాశాలను 100 ఎకరాల భూమితో మరియు భవనాలతో ముందుకు వచ్చిన రీత్యా వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు ఈ విద్యా సంవత్సరం 2022-23 నుండే ప్రారంభమయ్యేల ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇందులో భాగంగా – కాజా గ్రామ రైతు పి. కనకదుర్గ, సత్తెనపల్లి గ్రామ రైతు యం. కోమల, జొన్నల గడ్డ గ్రామ రైతులు వి. ప్రభు & వెంకాయమ్మ మరియు వెనిగండ్ల గ్రామ రైతు కె. నర్సి రెడ్డి గార్లను వివిధ పంటలలో వారు చేపట్టిన ఆధునిక పద్ధతులకు గాను వీరిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలలో ఆంధ్రప్రదేశ్ అగ్రి-మిషన్ శాస్వత సభ్యులు డా॥ యం. చంద్రశేఖర్ రెడ్డి; విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యులు : డా॥ వి. చెంగారెడ్డి, బి. శ్రీనివాసరావు, డా॥ వి. శ్రీనివాసరావు, డా॥ పి.వి.ఆర్.ఎం. రెడ్డి మరియు సి. రామమోహన రెడ్డి; విశ్వవిద్యాలయ అధికారులు: రిజిస్ట్రార్ మరియు ఉన్నత విద్యాపీఠాధిపతి డా॥ జి. రామారావు; పరిశోధనా సంచాలకులు డా॥ యల్. ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డా॥ పి. రాంబాబు; వ్యవసాయ పీఠాధిపతి డా॥ ఏ. ప్రతాప్ కుమార్ రెడ్డి; వ్యవసాయ ఇంజనీరింగ్ & సాంకేతికత పీఠాధిపతి మరియు కంట్రోలర్ డా॥ కె. ఎల్లా రెడ్డి, సామాజిక విజ్ఞాన పీఠాధిపతి మరియు విశ్వవిద్యాలయ లైబ్రేరియన్ డా॥ సి.హెచ్. చిరంజీవి, విద్యార్థి కార్యకలాపాల పీఠాధిపతి డా॥ యం. మార్టిన్ లూథర్, ఆర్.ఎ.ఆర్.ఎస్., లాం, సహ పరిశోధనా సంచాలకులు డా॥ పి. రత్నప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన తరగతి భవనాలు, విత్తన గిడ్డంగులు, రైతు వసతి గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమం

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ కళాశాల, నైరాలోని తరగతి గదులు; ఎస్.వి. వ్యవసాయ కళాశాల, తిరుపతిలోని నైపుణ్యాభివృద్ధి కేంద్రం; కృషి విజ్ఞాన కేంద్రం మరియు వ్యవసాయ పరిశోధనా స్థానం, ఆమదాలవలస, వ్యవసాయ పరిశోధనా స్థానం, విజయనగరంలలోని విత్తన గిడ్డంగి మరియు విత్తన శుద్ధి కేంద్రాలు; ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని చింతపల్లిలోని వ్యవసాయ సాంకేతిక వ్యాప్తి కేంద్రం & రైతు వసతి గృహాల ప్రారంభోత్సవంను ఆన్‌లైన్ దృశ్య శ్రవణ మాధ్యమంలో తేది 24.06.2022 న విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి గారు; అటారి జోన్ – X, హైదరాబాద్, సంచాలకులు డా॥ జె.వి. ప్రసాద్ గారి సమక్షంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, హైదరాబాద్ సంచాలకులు డా॥ సి.వి. రత్నావతి, విశ్వవిద్యాలయ వ్యవసాయ పీఠాధిపతి డా॥ ఏ. ప్రతాప్ కుమార్ రెడ్డి, విద్యార్థి కార్యకలాపాల పీఠాధిపతి డా॥ యం. మార్టిన్ లూథర్, పరిశోధనా సంచాలకులు డా॥ యల్. ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డా॥ పి. రాంబాబు, క్షేత్రాధికారి శ్రీ పి.వి. నరసింహరావు, అసోసియేట్ డీన్‌లు, సహ పరిశోధనా సంచాలకులు, కార్యక్రమ సమన్వయ కర్తలు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు

డా।। ఏ. మనోజ్, శాస్త్రవేత్త (విస్తరణ)
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, గుంటూరు - 522 034

**ప్రేమ్‌కుమార్, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా.**

**ప్ర. వెదవరిలో కలుపు రాకుండా వాడే కలుపు మందులను గూర్చి వివరించండి ?**

**జ.** విత్తనం విత్తిన 2 నుంచి 3 రోజులలోపు భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు ఎకరానికి 1.5 లీటర్ల పెండిమిథాలిన్ లేదా 500 మి.లీ. ప్రిటలాక్లోర్ + సేఫనర్ లేదా 35 గ్రా. ఆక్సాడయార్జిల్ వంటి వాటిలో ఏదో ఒక మందును 200 లీటర్ల నీటిలో కలిపి భూమిపై పిచికారి చేయాలి.

**రమేష్, పులచర్ల, కనెకల్ అనంతపురం జిల్లా.**

**ప్ర. ఆముదం పంటలో అధిక దిగుబడి ఇచ్చే రకాలను సూచించండి ?**

**జ.** ఆముదంలో ప్రగతి, హరిత, కిరణ్ అనే సూటి రకాలను పి.సి.హెచ్. 111, పి.సి.హెచ్. 222, ఐ.సి.హెచ్. 66, జి.సి.హెచ్. 8 అనే సంకర రకాలను వేసుకోవచ్చు.

**నారాయణ, ఇందుర్తి, ఖమ్మం, తెలంగాణ.**

**ప్ర. వేరుశనగలో ఖరీఫ్ కాలానికి వేసుకోదగ్గ మేలైన రకాలను తెలియజేయండి ?**

**జ.** వేరుశనగలో కదిరి హరితాంధ్ర, కదిరి అమరావతి, కదిరి లేపాక్షి, కదిరి 7 (బోల్డ్), కదిరి 8 (బోల్డ్), కదిరి 9, నిత్యహరిత మరియు ప్రగతి వంటి రకాలు ముఖ్యమైనవి.

**కుమార్, కనిగిరి, ప్రకాశం జిల్లా.**

**ప్ర. కందిలో అధిక దిగుబడినిచ్చే రకాలను తెలియజేయండి?**

**జ.** కందిలో ఎల్.ఆర్.జి. 105, టి.ఆర్.జి. 59, ఎల్.ఆర్.జి.133-33, ఎల్.ఆర్.జి. 52, ఐ.సి.పి.ఎల్. 85063, ఐ.సి.పి.ఎల్. 87119 మరియు ఐ.సి.పి. 8863 వంటి రకాలు ముఖ్యమైనవి.

**మల్లన్న, పార్వతీపురం, ఆధోని, కర్నూల్ జిల్లా.**

**ప్ర. ప్రత్తి పంటకి విత్తు దూరం తెలియజేయండి ?**

**జ.** రాయలసీమ ప్రాంతాలకైతే వరుసల మధ్య దూరం 120 నుంచి 150 సెం.మీ., మొక్కల మధ్య దూరం 45-60 సెం.మీ. లేదా కోస్తా ప్రాంతాల నల్ల నేలలకైతే వరుసల మధ్య దూరం 105 నుంచి 120 సెం.మీ., మొక్కల మధ్య దూరం 45-60 సెం.మీ. ఉంచుకోవాలి.

**శ్రీరాం నాయుడు, రావివలస, గరుగుబిల్లి, మన్యం జిల్లా.**

**ప్ర. వరి నారు పోసి వారం రోజులైయింది, కలుపు ఎక్కువగా ఉంది నివారణ తెలియజేయండి ?**

**జ.** ఎకరా నారుమడికి బ్యూటాక్లోర్ లేదా బెంథియోకార్బ్ 1.5 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి మడిలో నీటిని తీసివేసి పిచికారి చేయాలి లేదా 14, 15 రోజులప్పుడు సైహలోఫాప్ బ్యూటైల్ 400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**కోటిరెడ్డి, ఉప్పలపాడు, రాజుపాలెం, గుంటూరు జిల్లా.**

**ప్ర. ప్రత్తిలో స్టాంప్ కలుపు మందు ఎంత మోతాదులో వేయాలి ఎప్పుడు వేయాలి. ?**

**జ.** ప్రత్తిలో పెండిమిథాలిన్ (స్టాంప్)ను ఎకరాకు 1.3 లీ. నుండి 1.6 లీ.చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే కాని, మరుసటి రోజు కాని పిచికారి చేయాలి.

**భువన్ కుమార్, బంగారు పాలెం, చిత్తూరుజిల్లా.**

**ప్ర. మామిడి మొక్కలు నాటటానికి తీసే గుంతలలో ఏఏ ఎరువులు వేసుకోవాలి. ?**

**జ.** అంటు మొక్కలను నాటటానికి ముందుగా గుంతల్లో 10 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల వేప పిండి, 200 గ్రా. సూపర్ ఫాస్ఫేట్ మరియు 50 గ్రా. క్లోరిపైరిఫాస్ పొడి మందును కలిపి వేయాలి.

**శ్రీనివాసరావు, అచ్చంపేట, గుంటూరు జిల్లా.**

**ప్ర. ప్రత్తిలో తామర పురుగులు నివారణ తెలియజేయండి ?**

**జ.** తామర పురుగులు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా డైఫెన్‌థియురాన్ 1.25 గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**అశోక్, యల్లాయపాలెం, కడవలూరు, నెల్లూరు జిల్లా.**

**ప్ర. ప్రత్తిని ఎప్పటి వరకు విత్తుకోవచ్చు. ?**

**జ.** ప్రత్తిని జులై నుంచి ఆగష్టు మాసం వరకు విత్తుకోవచ్చు.

# వాణిజ్య సరళిలో పొట్టేళ్ళ పెంపకంతో అధిక లాభాలు గడిస్తున్న యువకుడు

డా॥ జి. ప్రసాద్ బాబు, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం) ఏరువాక కేంద్రం, కర్నూలు.
డా॥ ఎన్. రమేశ్ నాయక్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ కె.లక్ష్మణ్, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు
డా॥ టి. శ్రీనివాస్, కార్యక్రమ సమన్వయకర్త, కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి.






ముగతి గ్రామం, ఎమ్మిగనూరు మండలానికి చెందిన ఏం.బి.ఏ. పట్టబద్రుడు శ్రీ బి.శివకుమార్ (ఫోన్.నెం. 81477 28355), అనే బెంగుళూరులో ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ నెలకు రూ. 30,000/- సంపాదించేవాడు. అతనికి వ్యవసాయం మరియు వాటి అనుబంధ విభాగాలలో ఔత్సాహికుడుగా ఎదగాలని ఎప్పటినుండో కోరిక. కరోనా కాలంలో అతను ఇంటి వద్ద నుండే తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ వ్యవసాయ అనుబంద రంగాలలో ఔత్సాహికుడిగా ఎదగడానికి కావలసిన శిక్షణ కొరకు కృషి విజ్ఞాన కేంద్రం (కె.వి.కె.) బనవాసిని సంప్రదించడం జరిగింది. అతని ఆసక్తిని గమనించి కె.వి.కె. శాస్త్రవేత్తలు అతనికి వారం రోజుల పాటు సమీకృత వ్యవసాయ విధానాలలో శిక్షణనిచ్చి అతనిలో నైపుణ్యాలను పెంపొందించడం జరిగింది. అందులో శాస్త్రీయ పరంగా వ్యవసాయ మరియు ఉద్యాన పంటలను పండించడం, వాణిజ్య పరంగా గొర్రెలు, మేకలు, పొట్టేళ్ళు, పశువులు మరియు కోళ్ళ పెంపకంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణలో అతను పొట్టేళ్ళ పెంపకంపై ఆసక్తి కనబరచి అనేక నూతన అంశాలను నేర్చుకోవడం జరిగింది. వాణిజ్య పరంగా పొట్టేళ్ళ పెంపకంపై కె.వి.కె.లో గల ప్రదర్శనా క్షేత్రాలను అలాగే పొట్టేళ్ళ పెంపకాన్ని విజయవంతగా చేపడుతున్న ఔత్సాహికుల వద్దకు విజ్ఞాన యాత్రలు చేపట్టి మరింత అవగాహనను కల్పించడం జరిగింది. ఈ పరిజ్ఞానంతో అతను 8 సెంట్ల స్థలాన్ని అద్దెకు తీసుకొని 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో 3.0 లక్షల రూపాయల పెట్టుబడితో ఒక షెడ్డును నిర్మించు కున్నాడు. అలాగే 3 నెలల వయసు గల నెల్లూరు బ్రౌన్, నెల్లూరు జోడిపి రకం 50 పొట్టేలు పిల్లలను కర్నూలు జిల్లా పత్తికొండ, పెబ్బేరు సంతలలో తక్కువ ధరకు కొనుగోలు చేసి పాక్షిక సాంద్ర పద్దతిలో పెంపకం మొదలుపెట్టాడు. కె.వి.కె. సాంకేతిక సహకారంతో సమయాను కూలంగా టీకాలు వేసుకోవడం, నట్టల నివారణ చేసుకోవడం, హెడ్జ్ ల్యుసర్న్, స్టైలో వంటి పచ్చిగడ్డి, మినరల్ ఇటుకలు, యూరియా మొలాసిస్ మినరల్ ఇటుకలను మేపడం వంటి నూతన యాజమాన్య పద్ధతులను అవలంబించాడు. శాస్త్రవేత్తలు తరచూ ఇతని యూనిట్ సందర్శించి ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసి అధిక లాభాలు పొందడానికి తగు సూచనలు, సలహాలు అందివ్వడం జరిగింది. ఈ విధంగా 4 నెలల్లో ఒక్కో పొట్టేలు బరువు 10 కిలోల నుండి 28.5 కిలోలకు పెరిగి మార్కెట్లో కిలో రూ. 450/- కు అమ్మాడు. నికరాదాయం ఇంకా

ఆదాయ వ్యయ వివరాలు :

| సం. | అంశం | యూనిట్ ధర (రూ.) | మొత్తం ఖర్చు (రూ.) |
|---|---|---|---|
| **పునరావృతం కాని ఖర్చులు / స్థిర వ్యయం** | | | |
| 1. | షెడ్డు నిర్మాణం (50'×20'), నీటి సరఫరా పైపులు, విద్యుత్తు, మేతవేసే ఫీడర్లు, నీటి నిల్వ ట్యాంకు (500 లీ. సామర్థ్యం కలది) మరియు ఇతరములు. | స్థానికంగా దొరికే పదార్థాలు ఉపయోగించి నిర్మించినది. | 3,00,000/- |
| | | **మొత్తము** | **3,00,000/-** |
| **పునరావృతం అయ్యే ఖర్చులు (4 నెలలకు)** | | | |
| 1. | 3 నెలల వయస్సు గల పొట్టేళ్ళ పిల్లలు | రూ. 6000 / పిల్ల<br>50 (3 నెలల వయసు కలవి @ 10 కిలోలు) | 3,00,000/- |
| 2. | వేరుశనగ కట్టె 10 క్వింటాళ్ళు | రూ. 7500 / క్వింటాళ్ళు | 75,000/- |
| 3. | దాణా @ 15 క్వింటాళ్ళు | రూ. 4000 / క్వింటాళ్ళు | 60,000/- |
| 4. | రోగ నిరోధక మందులు మరియు టీకాలు | టీకాలు, నట్టల నివారణ, మినరల్ రాళ్ళు మొ. | 20,000/- |
| 5. | పచ్చిగడ్డి మరియు విద్యుత్ ఖర్చులు | 0.4 హెక్టార్లు | 5,000/- |
| 6. | కూలీలు (మేపడానికి, కాపలాదారులు & కటింగ్) | 6 | 94,000/- |
| 7. | భూమి లీజు ఖర్చులు | 8 సెంట్లు / రూ. 40000 / సం. | రూ. 10,000/4 నెలలకు |
| | | **మొత్తము** | **5,64,000/-** |
| **రాబడి** | | | |
| 1. | సరాసరి అంతిమ పొట్టేళ్ళ బరువు (120 రోజులకి) | 28.5 కిలోలు | - |
| 2. | మరణాల రేటు | 4% | 2 |
| 3. | అంతిమంగా మిగిలిన పిల్లలు | 48 | 48 |
| 4. | సరాసరి అన్ని పొట్టేళ్ళ అంతిమ బరువు | 48 పిల్లలు × 28.5 కిలోలు | 1368 కిలోలు |
| 5. | పొట్టేలును మార్కెట్ లో అమ్మడం ద్వారా ఆదాయం | 24<br>రూ .450.0/కిలో | 24×28.5×450<br>రూ. 3,07,800/- |
| 6. | మాంసం అమ్మడం ద్వారా ఆదాయం | 24<br>రూ. 700/కిలో | 24×28.5×700<br>రూ. 4,78,800/- |
| 7. | గొర్రెల ఎరువు (0.2 టన్నులు) | రూ. 10,000/టన్ను | రూ. 2000/- |
| | | **మొత్తము** | **రూ. 7,88,600/-** |
| **ఆదాయం** | | | |
| 1. | మొత్తం ఖర్చు (120 రోజులకి)<br>• పునరావృతం కాని ఖర్చులు (స్థిరాస్థిపై 2.5 శాతం తరుగుదల)<br>• పునరావృతం అయ్యే ఖర్చులు | | రూ. 7,500/-<br>రూ. 5,64,000/- |
| | | **మొత్తము** | **రూ. 5,71,500/-** |
| 2. | నికర ఆదాయం (120 రోజులకు) | రూ. 7,88,600 - రూ. 5,71,500 | రూ. 2,17,100/- |
| 3. | నికర ఆదాయం (నెలకు) | రూ. 2,17,100/4 | రూ. 54,275/- |
| 4. | ఆదాయ వ్యవ నిష్పత్తి | - | 1.37 |
| 5. | ఉపాధి కల్పించబడుతున్న సంఖ్య | 6 మందికి | - |
| 6. | ఉపాధి పొందిన దినాలు | 350 రోజులు | - |





పెంచుకోవడానికి తన షెడ్ దగ్గరే తాజా పొట్టేళ్ళ మాంసం అందించే ఏర్పాటు చేసినందు వలన కిలో రూ. 700/- కు అమ్ముకోగలిగాడు. ఫలితంగా ఆధాయం రెట్టింపైనందున నెలకు రూ. 54,275/- నికర ఆదాయన్ని పొందగలిగాడు.

కృషి విజ్ఞాన కేంద్రం వారి పరిచయంలో తన జీవితం ఒక మలుపు తిరిగి తన కల నెరవేరిందని సంతృప్తి చెంది గ్రామంలోని ఇతర నిరుద్యోగ యువతకు, రైతులకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇతనిని చూసి దాదాపు 10 మంది యువత వాణిజ్య సరళిలో చిన్న మొత్తంలో పొట్టేళ్ళను పెంచడానికి మొగ్గు చూపుతూ దానికి కావలసిన ఏర్పాట్లను చేస్తున్నారు. శివకుమార్ తనకు వచ్చిన లాభాలతో విద్య, వైద్యం వంటి గృహ అవసరాలు తీర్చుకుంటూ కొంత మొత్తాన్ని రెండతస్థుల షెడ్డు నిర్మించడానికి ప్రయత్నాలు సాగిస్తున్నాడు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : **74163 84968**



# రైతులు మరియు రైతు సమూహాల నుండి మొక్కల జన్యు సంరక్షక రైతుల పురస్కారం / బహుమతి / గుర్తింపు దరఖాస్తుల ఆహ్వానం

మొక్క రకాల రక్షణ మరియు రైతు హక్కుల అధికార సంస్థ, వ్యవసాయ మరియు రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ వారు ఉనికిలో ఉన్న మరియు కొత్త మొక్క రకాలను అభివృద్ధి పరిచిన రైతులు లేదా రైతు సమూహాలకు / బృందాలకు మొక్కల జన్యు సంరక్షక రైతుల పురస్కారం / బహుమతి / గుర్తింపును ఇచ్చుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. పురస్కార వివరాలు ఈ క్రింద వివరించబడినవి.

| వ.సం. | పురస్కారం పేరు | సంవత్సరం | బహుమతులు | రైతులు / రైతు సమూహాలకు ఇచ్చే పురస్కారాల సంఖ్య |
|---|---|---|---|---|
| 1. | మొక్కల జన్యు రక్షణ సమూహ పురస్కారం | 2020-21 & 2021-22 | రూ. 10 లక్షలు, ధృవ పత్రం & జ్ఞాపిక | 5 రైతు సమూహాలు |
| 2. | మొక్కల జన్యు రక్షణ రైతు బహుమతి | 2020-21 & 2021-22 | రూ. 1.5 లక్షలు, ధృవ పత్రం & జ్ఞాపిక | 10 మంది రైతులు |
| 3. | మొక్కల జన్యు రక్షణ రైతు గుర్తింపు | 2020-21 & 2021-22 | రూ. 1.00 లక్ష, ధృవ పత్రం & జ్ఞాపిక | 20 మంది రైతులు |

దరఖాస్తు చేయుటకు ఆఖరు తేది : 31.08.2022

*మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన చిరునామా :*


**మొక్క రకాల రక్షణ మరియు రైతు హక్కుల అధికార సంస్థ**

ఎన్.ఎ.సి.యస్. కాంప్లెక్స్, డి.పి.యస్. మార్గ్, వ్యవసాయ మరియు
రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ - 110 012

**ఫోన్ నెం :** 011-25848127, 25841696; **మొబైల్ నెం :** 91-98990 23566, **Fax** :011-25840478,
వెబ్‌సైట్ **(Website) :** www.plantauthority.gov.in, ఇ-మెయిల్ **(Email) :** chairperson-ppvfra@nic.in




RNI NO : APTEL/2012/46939

**AUGUST 2022**

Postal Regd. No. GTR/82/2022-24
Date of Publication : 07-08-2022
Date of Posting 09-08-2022

## డా॥ వై.ఎస్.ఆర్. రైతు దినోత్సవ వేడుకలు




ANGRAU

# ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

**లాం, గుంటూరు - 522 034**

ముద్రణ & ప్రచురణ కర్త : ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి, ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము, గుంటూరు.

ముద్రణాలయం : ప్రజాశక్తి ప్రింటర్స్ & పబ్లిషర్స్ ప్రై.లి., కృష్ణనగర్, తాడేపల్లి, గుంటూరు జిల్లా.